## మహమ్మారి గంజాయితో.. తల్లిదండ్రులకు గుండెకోత




2 లో


# వరంగల్ వార్త

వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జయశంకర్, జనగామ, ములుగు

సోమవారం 18, మే 2026 | 16 పేజీలు


బిడి శర్మ, ఎస్ఆర్ శంకరన్ లాంటి ఐఏఎస్ అధికారులు బాటలో పిఓ లెనిన్ వత్సల్ టోప్పో వెళతారా... పిఓ లెనిన్ వత్సల్ టోప్పో పైనే ఆదివాసీల ఆశలు..

## ప్రక్షాళన చేపడతారా.. పైరవీలకు

# తలొగ్గుతారా...?

ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ఏర్పాటైన ఏటూరునాగారం ఐటీడీఏ ప్రస్తుతం అనేక ఆరోపణల కేంద్రంగా మారిందన్న విమర్శలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల నిధులు ప్రతి సంవత్సరం విడుదల అవుతున్నప్పటికీ, మారుమూల గిరిజన గ్రామాల్లో మాత్రం పరిస్థితులలో ఐటీడీఏ నిర్మించిన లక్ష్యానికి దూరంగా ఉండటం అనేక చర్చలకు దారితీస్తోంది. గిరిజన భూముల రక్షణ, అటవీ హక్కుల పరిరక్షణ, స్థానిక ఆదివాసీల హక్కుల కోసం అమలు కావాల్సిన ఏజెన్సీ చట్టాలు అధికార ఫైళ్లకే పరిమితమయ్యాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

*అక్రమాల అగాధంలో ఏటూరునాగారం ఐటీడీఏ..*
*నేటికీ తప్పని "డోలీ" మోతలు..*
*ఏనాటికి తీరుతాయో ఆదివాసుల వెతలు...*

*కొందరు కక్కుర్తి అధికారులకు టీఏడీఏ గా మారిన ఐటీడీఏ*
*కాగితాలపై కోట్ల రూపాయల నిధుల ఖర్చులు*
*కానరాని గిరిజన జీవితాల్లో వెలుగులు*

*కాగితాల కాకి లెక్కల పైనే గిరిజనుల అభివృద్ధి*
*మంత్రి సీతక్క క్షేత్రస్థాయిలో చొరవ చూపితేనే*
*ఐటీడీఏ మనుగడ ఉంటున్న గిరిజనం..*

7 లో

## అడవిలో ప్రాంతం లో అంతరించి పోతున్న
# 'ఆకు బంగారం'...



అడవిబాట మాయం..
పలిమెలలో కనుమరుగవుతున్న ఉపాధి...!
తునికి ఆకుతో బతికిన పలిమెల గిరిజన జీవితాలు..
సరైన ఆకు సేకరణ లేక వెలవెలబోతున్న వైనం..?

పలిమెల, ప్రభాతవార్త : ఒకప్పుడు వేసవి కాలం మొదలైం దంటే పలిమెల అడవులు ప్రత్యేకమైన కదలికతో మేల్కొ నేవి. తెల్లవారక ముందే గిరిజన గ్రామాల్లో చప్పుళ్లు వినిపించేవి. మహిళలు తలపై బుట్టలు, పురుషులు భుజాలపై సంచులు, పిల్లలు చేతుల్లో చిన్న కర్రలతో అడవి దారులు పట్టేవారు. కారణం ఒక్కటే...'తునికి ఆకు'. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అది కేవలం అడవిలో పెరిగే ఆకు కాదు.. జీవనాధారం, ఆకలి తీర్చిన ఆర్థిక వనరు,

2లో

## ఫ్యూయల్ పిల్
# చేయాల్సిందే...!

సరస్వతి అంత్య పుష్కరాలకు వన్ వే..
బస్వాపూర్ నుండి కాళేశ్వరం రూట్‌లో పెట్రోల్ బంకులు నిల్..
వాహనాల్లో అదనపు ఇంధనం ఉంచుకోవాలి..
భక్తులు సురక్షిత ప్రయాణం చేసేలా ఏర్పాటు చేసుకోవాలి..
సరస్వతి అంత్య పుష్కరాల భక్తులకు పోలీసుల సూచన

మహదేవపూర్, ప్రభాతవార్త : జయశంకర్ భూపాల పల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 21 నుండి జూన్ 1 వరకు సరస్వతి అంత్య పుష్కరాలు జరగనున్నాయి. ఈ ఆధ్యాత్మిక ఘట్టానికి సుమారు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా భక్తులకు ప్రైవేటు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం కాళేశ్వరం

2లో

# ఫ్యూయల్ పిల్ చేయాల్సిందే...!

-సరస్వతి అంత్య పుష్కరాలకు వన్ వే..

-బస్వాపూర్ నుండి కాళేశ్వరం రూట్ లో పెట్రోల్ బంకులు నిల్..

-వాహనాల్లో అదనపు ఇంధనం ఉంచుకోవాలి..

-భక్తులు సురక్షిత ప్రయాణం చేసేలా ఏర్పాటు చేసుకోవాలి..

-సరస్వతి అంత్య పుష్కరాల భక్తులకు పోలీసుల సూచన

**మహదేవపూర్, మే 17, ప్రభాతవార్త :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లో ఈనెల 21 నుండి జూన్ 1 వరకు సరస్వతి అంత్య పుష్కరాలు జరగనున్నాయి. ఈ ఆధ్యాత్మిక ఘట్టానికి సుమారు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా భక్తులకు ప్రైవేటు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలకు ప్రైవేటు వాహనాల్లో ఆంధ్రప్రదేశ్, అదేవిధంగా హైదరాబాద్, ఖమ్మం హనుమకొండ వరంగల్ నుండి వచ్చే భక్తుల వాహనదారులకు ట్రాఫిక్ అంక్షాల నిమిత్తం బస్వాపూర్ నుండి కాళేశ్వరం వరకు వన్ వే లో వెళ్లాలని నిర్ణయించారు. కాగా బస్వాపూర్, రుద్రారం, కొయ్యూరు, గంగారం ఎక్స్ రోడ్, దామరకుంట, గుండ్రాత్ పల్లి, అన్నారం, మద్దులపల్లి కాళేశ్వరం వరకు వన్ వే రూట్‌లో పెట్రోల్ బంకులు అందుబాటులో ఉండవని జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులు హెచ్చరిస్తున్నారు. కావున వాహనదారులు ప్రయాణం ప్రారంభించే ముందే వాహనాల్లో ఇంధనం (ఫ్యూల్) పూర్తిగా నింపుకోవాలని సూచించారు. సిద్దిపేట, కరీంనగర్, వేములవాడ, పెద్దపల్లి, మంథని మీదుగా కాళేశ్వరం చేరుకునే వాహనదారులు గమనించాలని కోరుతున్నారు. ఈ ప్రయాణాన్ని




సురక్షితంగా మార్చుకోవలని సూచిస్తున్నారు.

### ముందే ఫిల్ చేయండి...

బస్వాపూర్ దాటకముందే మీ వాహనాల్లో ఇంధనం నింపుకోవడం తప్పనిసరని కోరుతున్నారు. వన్‌వే ట్రాఫిక్ పుష్కరాల రద్దీ దృష్ట్యా ఈ మార్గంలో వన్‌వే నిబంధనలు అమలులో ఉన్నాయి. అదనపు నిల్వ వీలైతే అత్యవసర పరిస్థితి కోసం వాహనాల్లో అదనపు ఇంధనాన్ని ఉంచుకోవాలని మార్గమధ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్థానిక పోలీసులను లేదా హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరుతున్నారు. గత సరస్వతి పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని పార్కింగ్ సమస్య తలెత్తకుండా మద్దులపల్లి, పూస్కుపల్లి, కాళేశ్వరం, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆదిలాబాద్, మంచిర్యాల, ధర్మపురి, జగిత్యాల నుండి వచ్చే వాహనాలకు కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన వద్ద వాహనాలు నిలుపుకునే విధంగా మొత్తంగా 290 ఎకరాలలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.

# మహమ్మారి గంజాయితో.. తల్లిదండ్రులకు గుండెకోత

-మానుకోటలో గంజాయికి బానిస అవుతున్న యువత

-బంగారం లాంటి భవిష్యత్తు సగంలోనే ముగింపు

-ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు గంజాయి దిగుమతి..?

**మహబూబాబాద్ ప్రతినిధి,ప్రభాతవార్త:** నేటి యువత బంగారం లాంటి భవిష్యత్తును గంజాయికి బానిసై మధ్యలోనే జీవితాన్ని ముగించి తల్లిదండ్రులకు గుండెకోత విదిస్తున్నారు. పట్టణంలోని శివారు కాలనీల్లో యువత అడ్డాగా చేసుకొని సిగరెట్లలో గంజాయి నింపుకొని గంజాయి సేవిస్తున్నట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుండి మహబూబాబాద్ జిల్లాకు పెద్దమొత్తంలో గంజాయి రవాణా జరుగుతుందని గంజాయి రవాణాదారులు యువతను టార్గెట్ చేసుకొని స్కూల్, కళాశాల పిల్లలకు విక్రయించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకొని విక్రయిస్తున్నట్లు సమాచారం. ప్రత్యేకంగా ఇంజనీరింగ్, మెడికల్ కళాశాల విద్యార్థులను టార్గెట్ చేసుకొని విక్రయిస్తున్నట్లు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల వారు గంజాయిని చిన్నచిన్న పాకెట్‌ల రూపంలో తయారుచేసుకొని రైల్వేస్టేషన్, బస్టాండ్‌లలో మధ్యవర్తులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మధ్యవర్తులు ఆ పాకెట్‌లను జిల్లా అంతటా విక్రయించే విధంగా ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గంజాయి సేవించిన యువత ఆ మత్తులో తాను ఏం చేస్తాడో తనకు తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. గంజాయి సేవించడంతో నరాల బలహీనత ఏర్పడడం, ఏకాగ్రత కోల్పోవడం, మతిస్థిమితం లేకపోవడం, సహనం నశించడం వంటి లక్షణాలు ఏర్పడి యువత నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. పిల్లలు ఉన్నత చదువులు చదివి ప్రయోజకులై తల్లిదండ్రలను పోషిస్తారకుంటే గంజాయి మత్తుకు బానిసై తల్లిదండ్రులకే భారమైతున్న సంఘటనలు అనేకం. గంజాయికి బానిసైన వారు డబ్బుల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. గతంలో కూడా పొరుగు రాష్ట్రాల నుండి గంజాయి రవాణా అవుతున్న క్రమంలో మహబూబాబాద్ పోలీసులు వారిని పట్టుకొని వారిపై కేసులు నమోదు చేసిన దాఖలాలు ఉన్నాయి. అయినా జిల్లాకు గంజాయి రవాణా మాత్రం ఆగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సంబందిత జిల్లా అధికారులు గంజాయి మహమ్మారిని అరికట్టకపోతే జిల్లాలో అనేక మంది బానిసయ్యే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.





# అడవిలో ప్రాంతం లో అంతరించి పోతున్న 'ఆకు బంగారం'...

-అడవిబాట మాయం..పలిమెలలో కనుమరుగవుతున్న ఉపాధి...!

-తునికి ఆకుతో బతికిన పలిమెల గిరిజన జీవితాలు..

-సరైన ఆకు సేకరణ లేక వెలవెలబోతున్న వైనం..?

**పలిమెల, మే 17, ప్రభాతవార్త :** ఒకప్పుడు వేసవి కాలం మొదలైందంటే పలిమెల అడవులు ప్రత్యేకమైన కదలికతో మేల్కొనేవి. తెల్లవారక ముందే గిరిజన గ్రామాల్లో చప్పుళ్లు వినిపించేవి. మహిళలు తలపై బుట్టలు, పురుషులు భుజాలపై సంచులు, పిల్లలు చేతుల్లో చిన్న కర్రలతో అడవి దారులు పట్టేవారు. కారణం ఒక్కటే...'తునికి ఆకు'. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అది కేవలం అడవిలో పెరిగే ఆకు కాదు..జీవనాధారం, ఆకలి తీర్చిన ఆర్థిక వనరు, ఎన్నో కుటుంబాల ఆశాకిరణం. ఒకప్పుడు 'ఆకు బంగారం'గా పేరొందిన ఈ తునికి ఆకు సేకరణ ఇప్పుడు మాత్రం క్రమంగా కనుమరుగవుతున్న దృశ్యం కనిపిస్తోంది.

### ఒకప్పుడు అడవంతా ఉపాధి జాతర...

కొన్ని సంవత్సరాల క్రితం వరకు పలిమెల మండలంలోని అటవీ గ్రామాలు వేసవికాలంలో పూర్తిగా తునికి ఆకు సీజన్‌పైనే ఆధారపడేవి. వ్యవసాయ పనులు లేని కాలంలో ఈ ఆకుల సేకరణ వేలాది కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. గ్రామాల్లో ప్రతి ఇంటి ముందూ ఆకుల కట్టలు కనిపించేవి. పిల్లల నుంచి వృద్ధుల వరకు అందరూ పనిలో నిమగ్నమయ్యేవారు. రోజుకు ఎన్ని కట్టలు కట్టామన్నదే ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని నిర్ణయించేది. అడవిలో కోసిన ఆకులను ఇంటికి తీసుకొచ్చి ఒక్కో కట్టలో 50 ఆకుల చొప్పున జాగ్రత్తగా కట్టి కాంట్రాక్టర్లకు అప్పగించేవారు. కట్టల సంఖ్య ఎక్కువైతే ఆదాయం కూడా పెరిగేది. అప్పుడు తునికి ఆకుకు మంచి గిరాకీ ఉండడంతో కూలీలు కూడా ఆశాజనకంగా పనిచేసేవారు.

### తెల్లవారక ముందే మొదలయ్యే పోరాటం..

తునికి ఆకు సేకరణ అనేది సాధారణ పని కాదు. తెల్లవారక ముందే అడవిలోకి వెళ్లాలి. ఉదయం ఎండ పెరగకముందే ఆకులను కోయాలి. ఆలస్యమైతే ఆకులు వాడిపోతాయి. నాణ్యత తగ్గిపోతుంది. అందుకే ఉదయం నాలుగు గంటలకే గిరిజన గ్రామాల్లో కదలిక మొదలయ్యేది. పొద్దుపొడవక ముందే మహిళలు, యువకులు అడవి దారులు పడేవారు. దట్టమైన అడవుల్లో అడుగడుగునా ప్రమాదమే. పాములు, ఎలుగుబంట్లు, అడవి మృగాల భయం ఎప్పుడూ వెంటాడేది. అయినా కుటుంబ పోషణ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి చెట్లెక్కి ఆకులు కోసేవారు. ముళ్ల పొదల్లో నడుస్తూ, మండే ఎండలో గంటల తరబడి పనిచేయడం వారి దినచర్యగా మారిపోయేది.

### ఇంటిల్లిపాదీ కష్టమే..ఒక్క కట్ట వెనుక ఎన్నో కన్నీళ్లు...!

అడవి నుంచి ఆకులు తెచ్చిన తర్వాత అసలు పని మొదలయ్యేది. ఇంటి ముందు కుటుంబమంతా వలయంగా కూర్చుని ఆకులను కట్టలుగా తయారు చేసేవారు. మహిళలు ఆకులను సరిచేసి పేర్చేవారు. వృద్ధులు లెక్కపెట్టేవారు. పిల్లలు కట్టలు అందించేవారు. ఇలా కుటుంబమంతా కలిసి పనిచేసేది. ఒక్కో కట్ట వెనుక ఎన్నో చెమట చుక్కలు దాగి ఉండేవి. రాత్రివేళల వరకు కొనసాగే ఈ పనిలో విశ్రాంతి అనేది ఉండేది కాదు. అయినా ఆ కష్టంలో ఒక ఆశ ఉండేది కట్టలు ఎక్కువైతే కొంత ఆదాయం వస్తుందనే నమ్మకం.

### కల్లాల వద్ద కనిపించిన నిర్లక్ష్యం...

తునికి ఆకు సేకరణలో కూలీలు పడిన కష్టానికి సరైన గౌరవం దక్కేదనే చెప్పలేం. కాంట్రాక్టర్లు ఏర్పాటు చేసిన కల్లాల వద్ద కనీస సౌకర్యాలు కూడా లేకపోయేవి. మండుటెండలో పనిచేస్తున్న మహిళలకు తాగునీరు, విశ్రాంతికి నీడ, వైద్య సహాయం వంటి సౌకర్యాలు అందని పరిస్థితులు ఉండేవి. అడవిలో నుంచి తెచ్చిన బస్తాలను తలపై మోసుకుంటూ కిలోమీటర్ల దూరం నడవాల్సి వచ్చేది. సరైన రహదారులు లేక వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొన్ని సందర్భాల్లో నాణ్యత సరిగా లేదంటూ ఆకులను తిరస్కరించడం, చెల్లింపులు ఆలస్యం చేయడం కూడా సాధారణమయ్యేది.

### అగ్నిప్రమాదాల భయం..ప్రాణాలపై ముప్పు...

వేసవికాలంలో అడవులు ఎండిపోయి నిప్పులా మారిపోతాయి. చిన్న చిమ్మ కూడా పెద్ద అగ్నిప్రమాదానికి దారి తీసే ప్రమాదం ఉండేది. ఇలాంటి మంటల్లో ఇప్పటికే సేకరించిన ఆకులు కాలిపోవడం, కొన్నిసార్లు కూలీలు కూడా ప్రమాదాల్లో చిక్కుకోవడం జరిగేది. అడవిలో పనిచేసే సమయంలో ప్రమాదాలు జరిగినా కూలీలకు భద్రత కల్పించే వ్యవస్థ పెద్దగా ఉండేది కాదు. ప్రమాద బీమా లేకపోవడం వల్ల గాయపడినా, ప్రాణాలు కోల్పోయినా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవి.

### ఇప్పుడు ఎందుకు తగ్గిపోయింది తునికి ఆకు సేకరణ..?

ఒకప్పుడు పలిమెల ప్రాంత ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలిచిన తునికి ఆకు సేకరణ ఇప్పుడు మాత్రం అంతంతమాత్రంగానే కొనసాగుతోంది. అడవుల్లో తునికి చెట్లు తగ్గిపోవడం ప్రధాన కారణంగా మారింది. వర్షాభావం, అటవీ మార్పులు, అడవుల నరికివేత వంటి కారణాలతో ఆకుల ఉత్పత్తి తగ్గిందని స్థానికులు చెబుతున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడం. గతంలో కూలీలు పడిన కష్టానికి తగినంత ఆదాయం వచ్చేది. కానీ ఇప్పుడు ధరలు పెద్దగా పెరగకపోవడంతో శ్రమకు సరైన ప్రతిఫలం దక్కడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా అడవిలో ప్రాణాలకు తెగించి పనిచేసినా వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదని వారు చెబుతున్నారు. అందుకే యువత ఎక్కువగా ఇతర పనుల వైపు మళ్లుతోంది.

### భీమా లేక భయంతో వెనక్కి తగ్గుతున్న కూలీలు...!

తునికి ఆకు సేకరణలో ప్రమాదాలు సహజం. చెట్లెక్కి పడిపోవడం, అడవి జంతువుల దాడులు, పాముకాట్లు, అగ్నిప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉంటాయి. అయితే ప్రమాదం జరిగినప్పుడు కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇచ్చే స్థిరమైన బీమా వ్యవస్థ లేకపోవడం కూలీలలో భయాన్ని పెంచుతోంది. 'ప్రాణాలు పోయినా చూసుకునే వారు లేరు..కష్టపడినా భవిష్యత్తుకు భరోసా లేదు' అనే భావన గిరిజన కుటుంబాల్లో పెరుగుతోంది. దీంతో చాలామంది తునికి ఆకు పనిని మానేసి కూలీ పనులు, పట్టణాలకు వలసలు, ఉపాధి హామీ పనుల వైపు వెళ్తున్నారు.

### కోట్ల ఆదాయం..కానీ గిరిజనుడికి దక్కేది ఎంత..?

తునికి ఆకు ద్వారా ప్రభుత్వానికి, బీడీ పరిశ్రమలకు కోట్ల రూపాయల ఆదాయం వస్తున్నా.. ఆ ఆకును సేకరించే గిరిజన కుటుంబాల జీవితాల్లో మాత్రం పెద్ద మార్పు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. అడవిలో చెమటోడ్చేది గిరిజనుడే..కానీ లాభాలు మాత్రం మధ్యవర్తులు, వ్యాపార వర్గాలకే ఎక్కువగా చేరుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కష్టపడిన కూలీకి గౌరవప్రదమైన ధర, భద్రత, సంక్షేమం ఇప్పటికీ అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి.

### -ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం..

పలిమెల వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో తునికి ఆకు సేకరణను తిరిగి బలోపేతం చేయాలంటే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. కూలీలకు గిట్టుబాటు ధర కల్పించడం, ప్రమాద బీమా అమలు చేయడం, కల్లాల వద్ద తాగునీరు-వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయడం, అడవుల్లో రక్షణ చర్యలు చేపట్టడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని వారు సూచిస్తున్నారు. అలాగే తునికి చెట్ల సంరక్షణ, కొత్త మొక్కల పెంపకం చేపట్టకపోతే భవిష్యత్తులో ఈ జీవనాధారం పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అటవీ పరిజ్ఞానులు హెచ్చరిస్తున్నారు.

### అడవి ఇచ్చిన బతుకు..కాపాడాల్సిన బాధ్యత ఎవరిది..?

ఒకప్పుడు పలిమెల అడవుల్లో ప్రతి వేసవిలో కనిపించిన తునికి ఆకు సందడి ఇప్పుడు క్రమంగా మసకబారుతోంది. ఆకు కోసం అడవిబాట పట్టిన గిరిజన కుటుంబాల కష్టాలు ఇంకా అలాగే ఉన్నా..ఆశలు మాత్రం తగ్గిపోతున్నాయి. అడవి సంపదతో కోట్ల ఆదాయం వస్తున్నప్పుడు.. అడవినే నమ్ముకుని జీవించే గిరిజన కుటుంబాలకు కూడా సముచితమైన వాటా దక్కాలి. అప్పుడే 'ఆకు బంగారం' వెనుక ఉన్న నిజమైన శ్రమకు విలువ దక్కినట్టవుతుందని గిరిజన ప్రజలు కోరుతున్నారు.

## ఆలయ నిర్మాణానికి వార్డు సభ్యుడి విరాళం



చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త

మండలంలోని పాపయ్యపేట గ్రామంలో శ్రీశివరామాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు మరాటి కట్టయ్య ముందుకు వచ్చారు. గ్రామంలో ఎలాగైనా ఆలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో ముందుకు రావడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వార్డు సభ్యుడు కట్టయ్య తనవంతు సహాయంగా రూ.10106లు గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్‌గౌడ్‌కు అందించారు. గ్రామసర్పంచ్ మాట్లాడుతూ ఇలానే దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి సహకరించాలన్నారు. గ్రామస్తులు ఇంకా ఎవరైనా దాతల సహకారంతోనే నిర్మాణం అవుతుందన్నారు. గ్రామ పెద్దలంతా కమిటీగా ఏర్పడి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మెపా సోషల్ మీడియా కన్వీనర్‌గా నేహంత్‌కుమార్

చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త



మేపా వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా మండలంలోని పాపయ్యపేట గ్రామానికి చెందిన ఉప్పరి నేహంత్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్‌ముదిరాజ్ ఇందుకు సంబంధించిన నియామక పత్రాలు ఆదివారం యువకుడికి అందిం చారు. నేహంత్ కుమార్ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి జిల్లా స్థాయిలో బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా ముదిరాజ్ యువకులను చైతన్యం వంతం చేస్తామన్నారు. సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనకు అందరి సహకారంతో ముందుకు వెళతామన్నారు.

## కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలికి పరామర్శ

చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త

మండల కేంద్రం చెన్నారావుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు బండి పద్మను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కంది



కృష్ణచైతన్యరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవలే ఈమె రోడ్డు ప్రమాదంలో గాయపడింది. దీంతో విషయం తెలుసుకున్న కృష్ణచైతన్య వారి ఇంటికి చేరుకొని ఆరోగ్య విషయాలు తెలుసుకొని మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో కంది రవిచైతన్య, ఉప్పునూతుల రాజు, గుగులోతు నాని, మరాటి రాజు తదితరులు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలి

చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త

దూర ప్రాంతాలకు వెళ్లి ధాన్యాన్ని విక్రయించేకంటే అందుబాటులో ఉన్న కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చింతకింది వంశీ అన్నారు. సొసైటి ఆధ్వర్యంలో మండలంలోని అక్కల్‌చెడ జోజిపేటనారాయణతండా గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను స్థానిక గ్రామ సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. పండిన ధాన్యాన్ని కొనుగోలు చేసే బాధ్యత తమపై ఉందన్నారు. కాస్త ఆలస్యం అయినప్పటికి కాంటాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. ధాన్యాన్ని తాలు, లేకుండా ఆరబెట్టి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు లావుడ్య చందు, ఉపసర్పంచ్‌లు కక్కెర్ల రజిత శ్రీను, ఆరోగ్యం, సొసైటి సీఈవో చిట్టె రవి, భూక్య సురేష్, గ్రామ పార్టీ అధ్యక్షులు పులిచేరు రాజేందర్, మహేందర్‌రెడ్డి, జంగిలి రాజు, బోనగిరి సారయ్య, లావుడ్య వెంకన్న, ఒంటరి రాజు, మైనార్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నాచినపల్లి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దుగ్గొండి, మే 17, ప్రభాతవార్త

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి చదువులమ్మ చెట్లక్రింద కలుసుకున్న వేళ. మండలంలోని నాచినపల్లి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు 2008-09 పదో తరగతికి చెందిన 90మంది విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 17 సంవత్సరాల తర్వాత ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులకు శాలువాలు, మెమోంటోలు, బోకేలతో ఘనంగా సన్మానం చేశారు. చదువు నేర్చుకున్న తరగతి గదిని ఒక్కసారి తిరిగి గతంలో జరిగిన వాటిని నెమరు వేసుకున్నారు. 90 మంది విద్యార్థులు వివిధ స్థాయిలో స్థిరపడ్డారు. ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేందర్, సోమదాస్, సత్యనారాయణ, కృష్ణమూర్తి, అరుణ, ప్రమోదిని, విద్యార్థులు, రాజు, వినోద్, రవీందర్, అరుణ్, అన్నెబోయిన కవిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## స్థానికుల సమస్యను వెంటనే పరిష్కరించిన కౌన్సిలర్

నర్సంపేట,యే 17,ప్రభాతవార్త



స్థానికుల సమస్యను కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ వెంటనే పరిష్కరించారు. ఆదివారం నర్సంపేట మున్సిపాలిటీ 26వ వార్డు,వరంగల్ రోడ్డులోని అయ్యప్ప నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రెండవ విద్యుత్ సబ్ స్టేషన్ కోసం ఏర్పాటు చేస్తున్న హైటెన్షన్ విద్యుత్ టవర్ రహదారికి అడ్డుగా ఉందని కాలనీవాసులు కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన కౌన్సిలర్ వెంటనే సంబంధిత విద్యుత్ కన్‌స్ట్రక్షన్ శాఖాధికారులను (డిఈ,ఏడి,ఏఈ),సిబ్బందిని ఘటనా స్థలానికి రప్పించారు.కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా,ఆ విద్యుత్ టవర్ పాయింట్‌ను రహదారికి ఆటంకం కలగని రీతిలో పక్కకు జరిపించేలా చర్యలు తీసుకున్నారు.ప్రజల సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించినందుకు స్థానిక కాలనీవాసులు కౌన్సిలర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానికులు గుడిపూడి రామచంద్రరావు,మండల స్వామి,దూపటి కృష్ణమూర్తి, రామకృష్ణ,విష్ణువర్ధన్ రెడ్డి,నారాయణ రావు,నాడెం రామకృష్ణ,బండి వేణు,దోనాల రవి, గుండబోయిన శివకోటి తదితరులు పాల్గొన్నారు.

## ఫోరెన్సిక్ సైబర్ సెక్యూరిటీలో మాస్టర్స్ పట్టా పొందిన ప్రజ్వల

నర్సంపేట,మే 17,ప్రభాతవార్త



నర్సంపేట పట్టణానికి చెందిన పెద్దారపు ప్రజ్వల అమెరికాలోని న్యూ జెర్సీలో గల ప్రఖ్యాత సెయింట్ పీటర్స్ యూనివర్సిటీలో ఫోరెన్సిక్ సైన్స్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా సాధించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా పట్టాను ఇచ్చి ఘనంగా సత్కరించారు.దీంతో ప్రజ్వల తల్లిదండ్రులు పెద్దారపు రమేష్,రాధ ఇతర కుటుంబ సభ్యులు హర్షాన్ని వ్యక్తం చేస్తూ సంతోషాన్ని పంచుకున్నారు.విదేశాల్లో ఫోరెన్సిక్ సైన్స్‌లో మాస్టర్స్ పట్టా సాధించిన అది కొద్ది మందిలో ప్రజ్వల ఒకరు.ప్రజ్వల ఏడవ తరగతి వరకు నర్సంపేటలో,ఇంటర్ వరకు వరంగల్‌లో,ఫోరెన్సిక్ గ్రాడ్యుయేషన్ మధుర ఉత్తర ప్రదేశ్‌లో అభ్యసించింది అనంతరం ఫోరెన్సిక్‌లో ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికాలోని న్యూ జెర్సీలో గల సెయింట్ పీటర్స్ యూనివర్సిటీ అడ్మిషన్ ఇవ్వగ ప్రతిభ కనబరిచి మాస్టర్స్ పట్టా పొందడం గర్వించదగింది.

## నేరాలు-దారుణాలు

## మోడల్ కళాశాల విద్యార్థినికి కలెక్టర్ సన్మానం



చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త

మండలంలోని అమీనాబాద్ మోడల్ కళాశాల విద్యార్థిని గందం హాసినిని జిల్లా కలెక్టర్ సత్యశారద సన్మానించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మండలంలోని జల్లి గ్రామానికి చెందిన గందం వెంకన్న రాధికల కుమార్తె కళాశాల విద్యార్థిని గంధం హాసిని 971 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ఉత్తమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు విద్యా వారోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్తా చాటిన విద్యార్థినిని ఘనంగా సన్మానించారు. అనంతరం కుడా చైర్మన్ వెంకటరామ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శ్రీధర్‌సుమన్, జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్యనాయుడు సమక్షంలో ప్రశంస పత్రంతో పాటు రూపాయలు పదివేలు నగదు ప్రోత్సహాన్ని అందించారు. కాగా తమ కళాశాల విద్యార్థినికి జిల్లా స్థాయిలో ఇలాంటి గుర్తింపు రావడం పట్ల ప్రిన్సిపాల్ చిట్టె జ్యోతి సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల, పాఠశాలలో ఎంతో మంది ప్రతాభవంతులైన విద్యార్థులు ఉన్నారన్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం విద్యార్థుల కృషి, పట్టుదలతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో తాము మరిన్ని విజయాలు సాధిస్తామని తాము ఆకాక్షింస్తున్నామన్నారు.

## రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి సరుకులను విక్రయిస్తే తూకంలో మోసాలు



దుగ్గొండి, మే 17, ప్రభాతవార్త

రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన సరుకును దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తే తూకంలో మోసాలు జరుగుతాయని సొసైటి చైర్మన్ గుడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని మందపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి సరుకులను విక్రయిస్తే రవాణా ఛార్జీలు అధికం అవుతాయన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు దగ్గరలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన సరుకులకు మద్దతు ధర ఉంటుందన్నారు. ఏ గ్రేడ్‌కు రూ.2389, 2369 బి గ్రేడ్ రూపాయలు అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటి డైరెక్టర్ దంజ్యానాయక్, మండల వ్యవసాయాధికారి శ్యామ్, వైస్ చైర్మన్, సింగతి కార్తిక్, సోమశేఖర్, పీవో బిక్షపతి, రాజు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

## విద్యార్థుల సామార్థ్యాం పెంపొందించాలి

దుగ్గొండి, మే 17, ప్రభాతవార్త



ఈ వేసవి కాలంలో సమ్మర్ క్యాంపుతో విద్యార్థుల సామార్థ్యం పెంపొందుతుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలుగొండ రామస్వామి అన్నారు. మండల కేంద్రం ప్రభుత్వ హైస్కూల్‌లో ఆదివారం నాటికి సమ్మర్ క్యాంపు 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సాంస్కృతిక ఆటలు, క్యారమ్స్, డ్రాయింగ్, పుస్తక పటనం, చూచిరాత, చెస్, హ్యాండ్‌బాల్, యోగా, వ్రాత కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.




# గంగారంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం

**-'సైలెంట్ కిల్లర్'పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..**

**-హైపర్‌టెన్షన్‌ను నివారించడానికి ఆరోగ్యకరమైన జీవనశైలి ఒక్కటే మార్గం...**

**-ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ సుమన్**

కాటారం, మే 17, ప్రభాతవార్త

ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని గంగారాం పరిధిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవనశైలి మార్పులు, ముందస్తు పరీక్షల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గంగారాం ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ సుమన్ మాట్లాడుతూ..అధిక రక్తపోటు



(హైపర్‌టెన్షన్) ఒక నిశ్శబ్ద హంతకుడు అని హెచ్చరించారు. ప్రారంభ దశలో దీనికి ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవని, అందుకే ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తం ధమనుల గోడలపై చూపించే ఒత్తిడిని రక్తపోటు అంటారని, సాధారణంగా 120/80 బీపీ రీడింగ్‌ను నార్మల్ బీపీగా పరిగణిస్తారని ఆయన వివరించారు. దీని కంటే రీడింగ్ ఎక్కువగా ఉంటే హైపర్‌టెన్షన్‌గా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్సీడీ స్టాఫ్ నర్స్ స్వాతి మాట్లాడుతూ..ఆధునిక కాలంలో మారుతున్న అలవాట్లే ఈ వ్యాధికి ప్రధాన కారణమన్నారు. అధిక ఉప్పు వినియోగం, మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేదా వ్యాయామం లేకపోవడంతో పాటు పొగత్రాగడం, మద్యం సేవించడం, అనారోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్స్ తినడం, ఊబకాయం మరియు వంశపారంపర్యంగా వచ్చే కుటుంబ చరిత్ర అని, బీపీ నియంత్రణలో లేకపోతే భవిష్యత్తులో గుండెపోటు, స్ట్రోక్, మూత్రపిండాల వ్యాధులు వంటి ప్రాణాంతక సమస్యలు తలెత్తుతాయని ఆమె స్పష్టం చేశారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో అవగాహన ఎంతో ముఖ్యమని గుర్తు చేస్తుందని వైద్య సిబ్బంది తెలిపారు. హైపర్‌టెన్షన్‌ను నివారించడానికి సూత్రాలు పాటించాలని పిలుపునిచ్చారు. నిత్యం సమతుల ఆహారం తీసుకోవాలని, వంటల్లో ఉప్పు వాడకాన్ని బాగా తగ్గించాలని, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలన్నారు. ధ్యానం, యోగా ద్వారా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవాలని, ధూమపానం, మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారానే హైపర్‌టెన్షన్‌ను పూర్తిగా నివారించవచ్చని వైద్యులు పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా కమీషన్ సభ్యురాలును కలిసిన ఉపసర్పంచ్‌లు బాణయ్య, కుమార్

కాటారం, మే 17, ప్రభాతవార్త



హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు నునావత్ రాధని జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కాటారం ఉపసర్పంచ్ కొండగొర్ల బాణయ్య, రుద్రారం ఉపసర్పంచ్ బడితెల కుమారస్వామిల ఆధ్వర్యంలో ఆదివవారం కలుసుకున్నారు. మహిళా కమీషన్ కార్యాలయంలో సభ్యురాలు నునావత్ రాధాని కలిసిన నాయకులు ఆమెకు పూలమాలలు వేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆమెకు వారు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా కాటారం, రుద్రారం నరగామాల్లోని పలు అభివృద్ధి పనులతో పాటు మహిళల రక్షణ, సంక్షేమ పథకాల అమలు తీరును నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సాధికారతకు కమీషన్ తరపున పూర్తి సహకారం అందించాలని కోరారు. నాయకుల విజ్ఞప్తులపై మహిళా కమీషన్ సభ్యురాలు నునావత్ రాధా సానుకూలంగా స్పందించారు. మహిళల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల రక్షణకు కమీషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు స్థానికంగా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌లతో పాటు కాంగ్రెస్ యువజన నాయకులు బీరెల్లి రజిని కుమార్, కొండగొర్ల సుశాంత్, తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరం విద్యార్థినికి శాస్త్రీయ నృత్యంలో ప్రథమ స్థానం

**-ప్రశంస పత్రాన్ని అందజేసిన డీఈఓ రాజేందర్**

మహాదేవపూర్, మే 17, ప్రభాతవార్త

మహాదేవపూర్ మండలం కాళేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మాడుగుల వరేణ్య సుమహిత విద్య వారోత్సవాల్లో భాగంగా శనివారం గణపురంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొని శాస్త్రీయ నృత్య విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. వరేణ్యకు జిల్లా విద్య శాఖ అధికారి ముద్రమళ్ల రాజేందర్ ప్రశంస పత్రాన్ని అందించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ. విద్య వారోత్సవాల ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమేనని అన్నారు విద్యార్థిని ప్రదర్శన ఆకట్టుకుందని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కాళేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దోనికల రాజేందర్ మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను విద్యతో పాటు క్రీడ సాంస్కృతిక రంగాల్లో రాణింపజేసేందుకు పాఠశాల తరఫున నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. వరేణ్య ఉన్నత స్థాయికి చేరుకొని పాఠశాలకు మరింత పేరు తీసుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎమ్ఓఎస్ రమేష్, ఎమ్ఈఓ పి.విజయ్ పాల్ రెడ్డి, టీజీ ఎంఎస్ గణపురం ప్రిన్సిపల్ తిరుపతి, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కేజీబీవీ కాటారం విద్యార్థినీల ఘన విజయం

**-జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా బహుమతుల ప్రధానం**

**-విద్యా విజయోత్సవాల్లో మెరిసిన అశ్విత, సుమశ్రీ...**

**-ప్రిన్సిపాల్ చల్ల సునీత, ఉపాధ్యాయ బృందం హర్షం**

కాటారం, మే 17, ప్రభాతవార్త




తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా విద్యా వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ వారోత్సవాల ముగింపు కార్యక్రమమైన 'విద్యా విజయోత్సవాలు' వేదికగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాటారం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తమ పాఠశాల కీర్తిని చాటారు. ఈ విద్యా విజయోత్సవాల్లో కేజీబీవీ కాటారం విద్యార్థినులు జిల్లా స్థాయి ర్యాంకులతో మెరిశారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో వి.అశ్విత 1000 మార్కులకు గాను 983 మార్కులు సాధించి జిల్లాలోనే ద్వితీయ ర్యాంకు కైవసం చేసుకుంది. అదేవిధంగా పదో తరగతి ఫలితాల్లో ఎం.సుమశ్రీ 600 మార్కులకు గాను 567 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ద్వితీయ ర్యాంకు దక్కించుకుంది. జిల్లా స్థాయిలో ఘన విజయం సాధించిన అశ్విత, సుమశ్రీలకు జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా రూ. 10,000 నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను ఘనంగా ప్రదానం చేశారు. ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జిల్లా స్థాయి బహుమతులు సాధించడం పట్ల కేజీబీవీ కాటారం ప్రిన్సిపాల్ చల్లా సునీత, ఉపాధ్యాయ బృందం తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినుల ప్రతిభను, ఉపాధ్యాయుల కృషిని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కేజీబీవీ పాఠశాలల అభివృద్ధికి అనునిత్యం సహకరిస్తూ, విద్యార్థినులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఎల్లప్పుడూ ప్రోత్సాహాన్ని అందిస్తున్న విద్యాశాఖ అధికారులకు పాఠశాల తరఫున ధన్యవాదాలు తెలిపారు. తమకు నిరంతరం అండగా నిలుస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి ముద్రమళ్ల రాజేందర్‌కి, జీసీడీఓ శైలజకి, ఏఎమ్ఓ విజయపాల్ రెడ్డికి, సీఎంఓ రమేష్‌కి, అలాగే విద్యాశాఖ సిబ్బంది అందరికీ కేజీబీవీ కాటారం ప్రిన్సిపాల్ చల్ల సునీత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తరఫున పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మహాముత్తారం ఎంఈఓగా స్థానికుడికే బాధ్యతలు ఇవ్వాలి

**-ఏఐఏవైఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాజు డిమాండ్**

**-అవినీతి ఆరోపణలున్న స్థానికేతరుడిని వెంటనే తొలగించాలి**

**-లేదంటే డీఈఓ కార్యాలయం ముట్టడి...!**

మహముత్తారం, మే 17, ప్రభాతవార్త

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహా ముత్తారం మండల విద్యాధికారి (ఎంఈఓ)గా విధులు నిర్వహిస్తున్న స్థానికేతరుడైన ఎం.రవీందర్ రెడ్డిని తక్షణమే ఆ బాధ్యతల నుంచి తొలగించాలని ఆలిండియా అంబెడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు రామగిరి రాజు డిమాండ్ చేశారు. ఆదివారం మహాముత్తారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రామగిరి రాజు మాట్లాడుతూ..ప్రస్తుత ఎంఈఓ రవీందర్ రెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని మండిపడ్డారు. మండలంలోనే సమర్థులైన స్థానిక హెడ్మాస్టర్లు అందుబాటులో ఉన్నప్పటికీ, వారిని కాదని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానికేతరుడిని ఆ సీట్లో కూర్చోబెట్టడం అంటే అవినీతిని ప్రత్యక్షంగా ప్రోత్సహించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులకే ఎంఈఓ బాధ్యతలు అప్పగించాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాధికారి ఆ ఉత్తర్వులను బేఖాతరు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించకుండా, అవినీతికి తావిస్తున్న జిల్లా విద్యాధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మహాముత్తారం మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రధానోపాధ్యాయుల సీనియారిటీని పరిగణనలోకి తీసుకుని, స్థానిక విద్యావేత్తలకే తక్షణమే ఎంఈఓగా పూర్తి బాధ్యతలు అప్పగించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే, రాబోయే రోజుల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా విద్యాధికారి కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు పీక కిరణ్, పులియాల సురేష్, చిర్ర మల్లేష్ ఉన్నారు.



# నీటి సరఫరాలో పాతముగ్ధుంపురం దేశంలోనే ఆదర్శం

**-చిన్న గ్రామానికి దక్కిన అరుదైన అవకాశం**

**-గ్రామాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిపేలా కృషి- సర్పంచ్ కర్ణాకర్‌గౌడ్**

చెన్నారావుపేట- ప్రభాతవార్త:

కాలం ఏదైనప్పటికి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా గ్రామస్తులకు నిత్యం త్రాగునీటిని సరఫరా చేస్తున్న చిన్న గ్రామమైన మండలంలోని పాతముగ్ధుంపురం గ్రామం దేశంలోనే ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పంచాయతీ అభివృద్ధి సూచికలో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 9 అంశాల వారిగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఆదర్శ గ్రామాలను ఎంపిక చేస్తారు. అందులో భాగంగానే మండలంలోని పాతముగ్ధుంపురం గ్రామానికి నీటి సమృద్ధి అంశంలో ఉత్తమ ఆదర్శ గ్రామంగా జాతీయ స్థాయిలో ఇటీవలే ఎంపికైంది. త్వరలోనే గ్రామపంచాయతీ ఈ అవార్డును అందుకోనుంది.

**-నిరంతరం నీటి సరఫరా...**

కాగా గ్రామంలో సుమారు 320 నివాస గృహాలు ఉండగా గతంలో వాటితో పాటు మిషన్



భగీరథతో పాటు 260 నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. అలాగే స్థానిక ముగ్ధుంపురం చెరువులో 1, రహదారి చెంతనే ఆలయం పక్కన మరొకటి నల్లాల బావులు ఉన్నాయి. మిషన్ భగీరథతో పాటు ఈ బావుల ద్వారా ఇంటింటికి నిత్యం నీటి సరఫరా కొనసాగుతుంటుంది. దీంతో గత పదేండ్లుగా మండు వేసవిలో సైతం త్రాగునీటి సరఫరా కొనసాగిస్తున్నారు. ఇందుకు గతంలో ఉన్నటువంటి పంచాయతీ కార్యదర్శి శంషోద్దిన్ పట్టుదల గ్రామస్తుల సహకారం ఎంతో ఉంది. అలాగే గ్రామంలో చేదబావులు, బోర్లు ఎక్కువగా లేకపోవడంతో గ్రామస్తులంతా నల్లా నీటిపైనే ఆదారపడి ఉంటారు. నిరంతరం నీటి సరఫరాలో గ్రామ పంచాయతీ యంత్రాంగం చేస్తున్న కృషికి దక్కిన గుర్తింపు అని స్థానికులు పేర్కొంటున్నారు. ఇందుకు నూతన పాలకవర్గం సైతం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు



సాగుతున్నారు.

**-గ్రామాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలిపేలా కృషి....**

**-సర్పంచ్ ననుమాస కర్ణాకర్‌గౌడ్..**



నితనయం నీటి సరఫరాలో గ్రామం జాతీయ స్థాయిలో అవార్డు దక్కడం ఎంతో గర్వకార ణమని గ్రామ సర్పంచ్ ననుమాస కర్ణాకర్‌గౌడ్ ( పేర్కొన్నారు. బావుల్లో మోటర్లు పాడైన గేట్‌వాల్స్, పైప్‌లైన్స్ లీకేజి అయినప్పటికి ట్యాంకర్ ద్వారా నీటిని ఇంటింటికి అందిస్తున్నామన్నారు. ఇదేకాకుండా మౌళిక వసతులు కల్పిస్తూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపేలా తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్ వైఖరిపై ఎంపీ చామలను కలిసి వినతి

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ :

జనగామ జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్న నియంతృత్వతీరు వల్ల జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డిని హైదరాబాద్ పెద్ద అంబర్పేట్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలెక్టర్ బాధితుల రక్షణకమిటీ కన్వీనర్ సాదిక్ అలీ, కో కన్వీనర్లు కన్నారపు పరుశురాములు, మంగళంపల్లి రాజు ప్రతినిధిబృందం కలిసి మెమోరాండం అందచేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు కలెక్టర్ వైఖరిని, సమస్యలపరిష్కారంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో వైఫల్యాన్ని, కలెక్టరేట్ కార్యాలయంవద్ద ఆంక్షలు, జిల్లాపరిపాలనలో ఒంటెద్దు పోకడవిధానాలను ఎంపీకి వివరించినట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ పార్కింగ్ అధికారులకు మాత్రమే సౌకర్యవంతంగా పార్కింగ్ ఉంచుతూ అనేకసమస్యలపై సమీకృత కలెక్టరేట్ కార్యాలయానికి వస్తున్న ప్రజల వాహనాలకు పార్కింగ్ అనుమతి నిరాకరించి రోడ్డుబయటనే నిలవాలని ఆంక్షలుపెట్టారన్నారు. దీనివల్ల కార్యాలయానికి వచ్చే వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు మండుటెండలో చాలాదూరం కార్యాలయానికి నడవాల్సివస్తుందని తెలుపగా ఎంపీ స్పందించి ఈవిషయంలో తాను ఈరోజే



జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆంక్షలు ఎత్తివేసే విధంగా సామాన్యుల వాహనాలను కలెక్టరేట్‌లోనికి అనుమతించే విధంగా చర్యలుతీసుకుంటామని హామీఇచ్చారని తెలిపారు. అదేవిధంగా భూభారతి సమస్యలను పరిష్కరించడానికి పరిష్కరించడంలో కలెక్టర్‌కు సరియైన అవగాహనలేదని, తప్పులతడకలతో తీర్పులుఇవ్వడం వల్ల ప్రజలుఅనేకమైన ఇబ్బందులు పడుతున్నారని వివరించగా ఎంపీ సమస్యలను లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేస్తే వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడి శాఖపరమైన చర్యలుతీసుకుంటామన్నారన్నారు.

ఇక ఇందిరమ్మ ఇండ్లకు, ప్రజల ఇతరనిర్మాణ అవసరాలకు ఇసుక, మట్టివిషయం లారీల ద్వారా, ట్రాక్టర్లద్వారా కొనుగోలు చేసుకున్న సందర్భంలో నిబంధనలపేరుతో లక్షలాది రూపాయల జరిమానాలను వేస్తున్నాడని, దీనివల్ల తీవ్రమైన ఇబ్బందులుపడుతూ ప్రజలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని, వారి వ్యాపారాలు నడవక వాహనాల ఈఎంఐలు కట్టలేనిపరిస్థితిలో జిల్లాలో ఏర్పడ్డాయని ప్రస్తావించగా కలెక్టర్ ఏ విధివిధానాలను అనుసరిస్తున్నాడో తెలుసుకొని తగుచర్యలు తీసుకొని ట్రాక్టర్ల, లారీ, జెసిపి యజమానులకు తప్పకుండా న్యాయంచేస్తామని తెలిపారన్నారు. జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్న, వరికొనుగోలులో గతంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం కలెక్టర్‌చర్యలవల్ల కొనుగోలు సరిగా జరుగక ధాన్యంకల్లాలలో రాశులు పేరుకుపోయి ఉన్నాయని, ట్రాన్స్పోర్ట్ లోడింగ్ అన్‌లోడింగ్ సమస్యలు తీవ్రమై రైతులు నెలలతరబడి ఇబ్బందిపడుతూ రోడ్లపైకివచ్చి ఆందోళనచేస్తున్నపరిస్థితి జిల్లాలో రోజురోజుకు ప్రమవుతుందన్నారు. దీనికి నిదర్శనం నిన్న పెంబర్తిలో రహదారిపై రైతులుధర్నా చేసి ధాన్యంబస్తాలను తగలబెట్టిన విషయం వారిదృష్టికి తీసుకవచ్చినట్లు తెలిపారు. జిల్లాలో కలెక్టర్ వైఖరిపై కమిటీ చెప్పిన అన్ని విషయాలను సావధానంగా విన్న ఎంపీ త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిటీకి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## మారథాన్ కార్యక్రమంలో పాల్గొనండి

నర్మెట, మే 17 ప్రభాతవార్త :



ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 18న(సోమవారం) నర్మెట మండలకేంద్రంలో తలపెట్టిన మారథాన్ కార్యక్రమంలో మండల అధికారులు యువత ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలు నాయకులు పాల్గొనాలని ఎంపీడీవో కావ్య శ్రీనివాస్ కోరారు. యువత క్రీడలు పర్యాటక వారసత్వ సంస్కృతిలో భాగంగా ఉదయం ఏడున్నర గంటలకు ఎంపీడీవో కార్యాలయం నుండి మారథాన్ కార్యక్రమం నిర్వహింపబడుతుందని అందరూ తప్పకహాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు

చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం రాత్రి నెలకొంది. చెన్నారావుపేట గ్రామానికి చెందిన వరగంటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఖాదర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కుల గణన సర్వేలో భాగంగా ఖాదర్‌పేటలో సర్వే చేసి రాత్రి ఇంటికి వెళుతున్నాడన్నారు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం ఢీకొట్టిందన్నారు. దీంతో తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరళించారన్నారు. కాగా తలకు సైతం గాయాలు కావడంతో వరంగల్ నుండి హైదరాబాద్‌కు తరళించారన్నారు.

## అనారోగ్యంతో అంగన్‌వాడి ఆయా మృతి

చెన్నారావుపేట, మే 17, ప్రభాతవార్త



అనారోగ్యంతో అంగన్‌వాడి ఆయా మృతిచెందిన సంఘటన మండలం లోని కోనాపురం గ్రామంలో నెలకొంది. గ్రామానికి చెందిన జంగిలి రమ(45)స్థానిక అంగన్‌వాడి కేంద్రం లో ఆయాగా పనిచేస్తుందన్నారు. కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైయివేటు ఆసుపత్రిలో చేర్పించారన్నారు. చికిత్స పొందుతూనే ఆదివారం ఉదయం మృతిచెందిందన్నారు. మృతురాలి భర్త గతంలోనే చనిపోగా వీరికి ఒక కుమార్తె ఉందన్నారు. మృతిపట్ల తోటి అంగన్‌వాడి సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

## వానరానికి అంత్యక్రియలు

కొండమల్లేపల్లి,మే17,ప్రభాతవార్త:

విద్యుత్‌ఘాతంతో మృతి చెందినవానరానికి హిందూ సంప్రదాయ పద్ధతిలో స్థానిక యువకులు అంత్యక్రియలు నిర్వహించారు. కొండమల్లేపల్లిని హైదరాబాదు రోడ్డులో వానరం విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. అటువైపుగా వెళ్లిన యువకులు వానరం మృతి చెందిన విషయాన్ని గమనించారు. పలువురు యువకులు అక్కడికి చేరుకున్నారు. హిందువులు వానరాన్ని ఆంజనేయ స్వామి రూపంగా కొలుస్తారు.

# విద్యుత్ సిబ్బంది బిల్లుల జాప్యం..!

**గృహజ్యోతిపథకం కోల్పోతున్న వినియోగదారులు..!!**


**- 30రోజులకు కొట్టాల్సిన బిల్లు 32రోజులకు నమోదు**

**- 200యూనిట్లు దాటడంతో ఉచిత విద్యుత్ పథకంనుంచి బయటపడిన కుటుంబాలు**

**- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా..? అధికారుల వైఫల్యమా..?**

బచ్చన్నపేట, మే 17 ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న గృహజ్యోతిపథకం బిల్లులజాప్యంతో బచ్చన్నపేట మండలంలోని అనేక కుటుంబాలకు అందకుండా పోతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతీనెల 29 లేదా 30రోజులకు నమోదు చేయాల్సిన విద్యుత్‌బిల్లులను ఈసారి రెండురోజుల ఆలస్యంగా నమోదు చేయడంతో వినియోగ యూనిట్లు 200 దాటిపోయి లబ్ధిదారులు ఉచితవిద్యుత్ సదుపాయాన్ని కోల్పోయిన పరిస్థితి నెలకొంది. మండలంలోని 26గ్రామాల్లో సుమారు 8,810 మంది




గృహవినియోగదారులు గృహజ్యోతి పథకంకింద లబ్ధిపొందుతున్నారు. గత జనవరి నుంచి ఏప్రిల్ వరకు బిల్లులు సకాలంలో నమోదుకావడంతో వినియోగం 200యూనిట్లలోపే ఉండి లబ్ధిదారులు ఉచిత విద్యుత్ ప్రయోజనం పొందారు. అయితే ఏప్రిల్ నుంచి మేనెల బిల్లుల విషయంలో మాత్రం 32రోజుల తర్వాత రీడింగ్ తీసుకోవడంతో పలువురి వినియోగం 207యూనిట్ల వరకుచేరి బిల్లులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 30రోజులకే బిల్లునమోదు చేసిఉంటే తమవినియోగం



199యూనిట్లలోపే ఉండేదని, కేవలం రెండురోజుల ఆలస్యంతో ప్రభుత్వం అందిస్తున్న పథకంనుంచి బయటపడ్డామని వినియోగదారులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. వేసవికాలం కావడంతో విద్యుత్‌వినియోగం పెరిగిన సమయంలో అధికారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిందిపోయి నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. విద్యుత్ బిల్లులనమోదు బాధ్యతను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడంతో పర్యవేక్షణ లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమా..? లేక విద్యుత్‌శాఖ అధికారుల వైఫల్యమా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వినియోగదారులు అయితే ప్రభుత్వం నుంచే ఇలాంటి ఆదేశాలు వచ్చాయా..? అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి గృహజ్యోతి పథకం కోల్పోయిన లబ్ధిదారులకు న్యాయంచేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే బిల్లులనమోదు ప్రక్రియను ప్రతీనెల నిర్దిష్ట సమయానికి పూర్తిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# విద్యా విజయానికి రాష్ట్రం సెల్యూట్

**డిఈఓ సిద్ధార్థ రెడ్డి కృషిని ప్రశంసించిన మంత్రి సీతక్క.**
**ప్రతిభ చాటిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, నగదు ప్రోత్సాహకాలు.**
**కార్పొరేట్‌కు మించిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే...మంత్రి సీతక్క**



**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,మే 18:** పేదరికాన్ని రూపుమాపే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్యేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. అక్షరజ్ఞానం మనిషిని సమాజంలో ఉన్నత స్థానంలో నిలబెడుతుందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "విద్య విజ యోత్సవ దినోత్సవం" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సా హకాలు అందజేశారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో పది ఫలితాలలో ములుగు జిల్లా నెంబర్ వన్ గా నిలవడంలో విశేష కృషి చేసిన డీఈవో సిద్ధార్థ రెడ్డి కృషి మంత్రి సీతక్క ప్రశంసించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సహకారం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కృషితో మంచి ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని నిరంతరం కృషి చేయాలని, వైఫల్యాలకు కుంగిపోకుండా ముందుకు సాగాలని సూచించారు. బాలికలు అధిక సంఖ్యలో విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. ఏటూరునాగారానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడి కుమారుడు ప్రవీణ్ కుమార్ డీఎస్పీగా ఎంపిక కావడం, సాధారణ కుటుంబానికి చెందిన యువతి డీఎస్పీ స్థాయికి చేరుకోవడం వంటి ఉదాహరణలు ప్రస్తావిస్తూ కష్టపడి చదివితే ఎవరికైనా ఉన్నత స్థానాలు సాధ్యమని మంత్రి తెలిపారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో కంటైనర్ పాఠశాలల ఏర్పాటు ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, పాల్గొన్నారు.



## క్రీడలతో యువతకు కొత్త దిశ

**మంత్రి సీతక్క**

**యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి హితవు**





**ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,మే 17:** క్రీడలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. ములుగు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 115 జట్లు, దాదాపు రెండు వేల మంది యువకులు పాల్గొన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మంత్రి సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, పోటీ పరీక్షలకు సిద్ధమై మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.త్వరలో ములుగు, ఏటూరునాగారంలో 45 రోజుల శిక్షణా శిబిరాలు నిర్వహించి యువతకు మార్గదర్శనం చేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరిస్తూ, ప్రమాద రహిత జిల్లాగా ములుగును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.కామారం జట్టుకు విజేత ట్రోఫీ.ఫైనల్ పోటీలో ములుగు సబ్ డివిజన్ తాడ్వాయి మండలం కామారం గ్రామ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీతో పాటు రూ.11 వేల నగదు బహుమతి అందుకుంది. రన్నరప్‌గా మంగపేట మండలం బోర్ నర్సాపూర్ జట్టు నిలిచి రూ.7 వేల నగదు బహుమతి దక్కించుకుంది.300కు పైగా అవగాహన కార్యక్రమాలు.డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా 300కు పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రతి గ్రామంలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి డ్రగ్స్ రహిత జిల్లాగా ములుగును తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మనన్ భట్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

## మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి కమిటీ చైర్మన్ ఎర్రం గాని సురేష్ ని సన్మానించిన. బాడిషా ఆదినారాయణ.

మంగపేట మే17, ప్రభాతవార్త.

మల్లూరు శ్రీహేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్ ఎర్రం గారి సురేష్ ని ఆదివారం మంగపేట యూత్ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ మాట్లాడుతూశ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను ఘనంగా విజయవంతంగా నిర్వహించిన మండల యూత్ కాంగ్రెస్ తరపున సన్మానించడం జరిగింది అలాగే రెండవ సారి శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ కమిటీ చైర్మన్గా నియమితులైన సురేష్ కి యూత్ కాంగ్రెస్ తరపున శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ గౌరవ అధ్యక్షులు కస్పా ముకుందం మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల నరేష్. యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నూతిల కంటి రాజు మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు బిల్పాటి నరేష్. పాయం సతీష్. యూత్ కాంగ్రెస్ మండల ప్రచార కార్యదర్శి మూగల చంటి. మండల సోషల్ మీడియా ఇంచార్జ్ భూక్య కుమార్. యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి జాడి మురళి,మండల యూత్ కాంగ్రెస్ సహాయ కార్యదర్శి మడెం శివశంకర్ పాల్గొన్నారు.






## మాక్ డ్రిల్ కారణంగా నేటి ప్రజావాణి రద్దు

.ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త,



ములుగు జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు.ప్రకృతి విపత్తుల సమయంలో వివిధ శాఖల సమన్వయంతో చేపట్టే సహాయక చర్యలు, రెస్క్యూ బృందాల పనితీరును పరీక్షించే మాక్ డ్రిల్‌ను నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు.ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ కోరారు. వచ్చే సోమవారం ములుగు కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## వరదలపై అలర్ట్

**నేడు ములుగులో మాక్ డ్రిల్.**

**విపత్తుల సమయంలో అధికారుల సమన్వయంపై నమూనా కసరత్తు.**

**ప్రజల్లో అవగాహన కల్పించాలి**

**: కలెక్టర్ హేమంత్**



***ములుగు జిల్లా బ్యూరో ప్రభాత వార్త, మే 17*** : రాబోయే వర్షాకాలంలో వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ నెల 18న జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ (నమూనా కసరత్తు) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు.ములుగు పట్టణంలోని వివేకానంద కాలనీ, కృష్ణన్ కాలనీ, పల్సాబ్‌పల్లి ప్రాంతాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వరదలు సంభవించిన సమయంలో క్షేత్రస్థాయిలో అధికారులు ఎలా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి అనే అంశాలపై ఈ కసరత్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎవాక్యుయేషన్ చర్యలు, సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్లు, పునరావాస కేంద్రాల ఏర్పాట్లపై ప్రత్యక్ష పరిశీలన జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఎస్‌డిఆర్ఎఫ్, ఫైర్, హెల్త్, మున్సిపల్ శాఖలు పరస్పర సమన్వయంతో వేగంగా స్పందించే విధానాన్ని ఈ కార్యక్రమం ద్వారా పరీక్షించనున్నట్లు వివరించారు.ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా అన్ని శాఖలు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

## గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం

ఆత్మకూర్ ఎం మే 17 ప్రభాత వార్త

ఆత్మకూరు ఎం మండల కేంద్రంలో సబ్ మార్కెట్ యార్డులో రెండు నెలలైనా 10 శాతం కొనుగోలు చేయలేని ప్రభుత్వం ఏమి చేస్తుందని సర్పంచ్ బి సు ధనలక్ష్మి చందర్ గౌడ్ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కుప్పలుగా పోసి రైతులను నట్టేట ముంచుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో 170 మంది రైతులు మార్కెట్లో పోస్తే ఇప్పటి వరకు 30 మంది రైతులకు కొనుగోలు జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు .వేరే గ్రామాల నుండి ఓట్ల కోసం గ్రామాల ద్వారా నుంచి రాజకీయం చేసి మార్కెట్లో పోసి దళారీలకు అమ్ముతున్నారని సర్పంచ్ బీసీ ధనలక్ష్మి ఆరోపించారు. ఆత్మకూరులో పోసిన వడ్ల కుప్పలను వెంటనే కాంట్రా లారీల ద్వారా మార్కెట్ ద్వారా తరలించాలని నినాదాలు ఇచ్చారు. అనంతరం మార్కెట్ యార్డుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీసు చందర్ గౌడ్ అ ఖిలపక్ష పార్టీల నాయకులు కోరే భిక్షపతి ,మోహన్ రెడ్డి ,మాద శ్రీను ,బండారు సత్యనారాయణ లోడి వెంకటయ్య, నాతి రాజు గౌడ్, మజ్జిగ రాంబాబు ,మజ్జిగ రమేష్ , యాస వెంకట్రెడ్డి, పంజాల సందీప్ , పంజాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రక్షాళన చేపడతారా... పైరవీలకు తలొగ్గుతారా...?

అక్రమాల అగాధంలో ఏటూరునాగారం ఐటీడీఏ..

నేటికీ తప్పని "డోలీ" మోతలు..

ఏనాటికి తీరుతాయో ఆదివాసుల వెతలు...

కొందరు కక్కుర్తి అధికారులకు టిఏడిఏ గా మారిన ఐటీడీఏ.

కాగితాలపై కోట్ల రూపాయల నిధుల ఖర్చులు.

కానరాని గిరిజన జీవితాల్లో వెలుగులు.

కాగితాల కాకి లెక్కల పైనే గిరిజనుల అభివృద్ధి.

ఇంజనీరింగ్ విభాగంలో కొందరు అధికారులు అక్రమాలు నిత్యం వృద్ధి.

మంత్రి సీతక్క క్షేత్రస్థాయిలో చొరవ చూపితేనే

ఐటీడీఏ మనుగడ ఉంటున్న గిరిజనం..

బిడి శర్మ,ఎస్ఆర్ శంకరన్ లాంటి ఐఏఎస్ అధికారులు బాటలో పిఒ లెనిన్ వత్సల్ టోప్పో వెళతారా...

పిఒ లెనిన్ వత్సల్ టోప్పో పైనే ఆదివాసీల ఆశలు..

**ములుగు జిల్లా క్రైమ్ బ్యూరో ప్రభాత వార్త.** ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసుల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా ఏర్పాటైన ఏటూరు నాగారం ఐటీడీఏ ప్రస్తుతం అనేక ఆరోపణల కేంద్రంగా మారిందన్న విమర్శలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల నిధులు ప్రతి సంవత్సరం విడుదల అవుతున్నప్పటికీ, మారు మూల గిరిజన గ్రామాల్లో మాత్రం పరిస్థి తులలో ఐటీడీఏ నిర్మించిన లక్ష్యానికి దూరంగా ఉండటం అనేక చర్చలకు దారితీస్తోంది. గిరిజన భూముల రక్షణ, అటవీ హక్కుల పరిరక్షణ, స్థానిక ఆదివాసీల హక్కుల కోసం అమలు కావాల్సిన ఏజెన్సీ చట్టాలు అధికార ఫైళ్లకే పరిమిత మయ్యాయన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. భూములు కోల్పోయిన గిరిజనులు న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుండగా, అక్రమాలు మాత్రం నిర్భయంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

## నేటికీ గిరిజనులకు అందని ద్రాక్షగా విద్య.. వైద్యం.. గృహాలు..?

ఆదివాసి కుటుంబాలకు మెరుగైన విద్య, నాణ్యమైన వైద్యం, గృహ సదుపాయాలు, వ్యవసాయ అవగాహన కల్పించాల్సిన ఐటీడీఏ లక్ష్యం పూర్తిగా నీరుగారిపోయిందని ఆదివాసీలు మండిపడుతున్నారు. అనేక గూడేల్లో ఇప్పటికీ తాగునీరు, రోడ్డు, ఆరోగ్య సేవలు లేని పరిస్థితి కొనసాగుతుండటం ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన అధికార వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. వర్షాకాలం వస్తే కొండాయి, దొడ్ల, మల్యాల గిరిజన గ్రామాలకు ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. కొండాయి బ్రిడ్జి నిర్మాణ పనులు గడువులోగా పూర్తి కావడం అనుమానంగానే ఉంది. మంత్రి సీతక్క హెచ్చరించిన పనులలో వేగం కనబడడం లేదు. ఇక్కడి అధికారుల నిర్లక్ష్యానికి ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే.. ప్రతి వర్షా కాలంలో మారుమూల గ్రామాల పరిస్థితి మరింత దారుణంగా మారు తోంది. సరైన రహదారులు, వంతెనలు లేక గర్భిణులను, రోగులను డోలీల్లో మోసు కుంటూ తీసుకెళ్లాల్సిన ఘటనలు ఇప్పటికీ కనిపిస్తూనే ఉన్నాయి. వరదలు వస్తే అనేక గ్రామాలు పూర్తిగా బయటి ప్రపంచంతో సంబం ధాలు కోల్పో తున్నప్పటికీ, శాశ్వత పరిష్కారాలపై చర్యలు కనిపించడం లేదని ఆదివాసీ ప్రజల నుండి ఆవేదన వ్యక్తం అవుతుంది

## అక్రమార్కుల అక్రమాలకి అడ్డాగా ఇంజనీరింగ్ విభాగం...?

ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగంపై అత్యంత తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పలు కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు ప్రారంభమైన కొద్ది నెలల్లోనే పగుళ్లు పడటం, గోడలు ఊడిపోవడం, రోడ్లు ధ్వంసం కావడం వంటి ఘటనలు వరుసగా వెలుగులోకి వచ్చిన ఘటనలు గతంలో అనేకం.పనుల్లో నాణ్యత లేకపోవడం, కాంట్రాక్టర్లతో కుమ్మక్కు, కమిషన్ వ్యవహారాలు, నిబంధనల పక్కదారి పట్టింపు వంటి అంశాలపై ఆదివాసి గిరిజ నప్రజల్లో తీవ్ర అసహనం రేపాయి.కాగితాలపై లక్షలు, కోట్లు చూపించి నాసిరకం పనులు చేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్న విమర్శలు గట్టిగా ఉన్నాయి.

## ఐటీడీఏ నిధులు కొందరికి ఏటీఎం... గిరిజన విద్యార్థుల పేరుతో కోట్ల దందా..?

స్థానికంగా కొందరు వ్యక్తులకు ఐటీడీఏ నిధులు ఏటీఎంలా మారిపోయాయన్న చర్చ గిరిజన ప్రాంతాల్లో బహిరంగంగానే సాగుతోంది. ప్రజల అభివృద్ధి కోసం విడుదలైన నిధులు, కొందరి స్వార్థపూరిత ప్రయోజనాలకు వినియోగ మయ్యాయన్న ఆరోపణలు రోజురోజుకీ పెరుగు తున్నాయి. ఆదివాసి గిరిజన విద్యార్థుల విద్యా వ్యవస్థకు కేటాయించిన కోట్లాది రూపాయల నిధుల్లో భారీ అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. అధిక ఎస్టిమేషన్ల పేరిట ప్రభుత్వ నిధులు కొల్లగొట్టారన్న టాక్ బలంగా వినిపిస్తోంది. విద్యార్థులకు అందించే యూనిఫాంలు, బెడ్షీట్లు, స్కూల్ సామగ్రి, ట్రంకు పెట్టెల వరకు మార్కెట్ ధరలకు మించి భారీ రేట్లు చూపించి బిల్లులు పెట్టారనే సమాచారం వెలుగులోకి వస్తోంది. గిరిజన పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు కావాల్సిన డబ్బు కొందరి జేబుల్లోకి వెళ్లిందన్న ఆరోపణలు ఆదివాసి సమాజాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తున్నాయి.

## అభివృద్ధి పోస్టర్లలో.. ఆదివాసీల జీవితాలు అమావాస్య చీకట్లో..

పాలకమండలి సమావేశాల్లో ఆమోదం పొందిన అనేక అభివృద్ధి పనులు గ్రామాలకు చేరకముందే ఫైళ్లలో ముగిసిపోయాయన్న విమర్శలు ఉన్నాయి. కాగితాలపై పూర్తయిన పనులు నేలమీద కనిపించకపోవడం, నిధుల వినియోగంపై పారదర్శకత లేకపోవడం అను మానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ప్రభుత్వ నివేదికల్లో, సమావేశాల్లో, ప్రకటనల్లో గిరిజన అభివృద్ధి గొప్పగా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి ఆదివాసుల జీవితాల్లో మాత్రం వెలుగు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి వెలుగులు గ్రామాలకు చేరకముందే అవినీతి చీకట్లు మింగేశాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## మంత్రి సీతక్క క్షేత్రస్థాయిలో చొరవ చూపితేనే ఐటీడీఏ మనుగడ..

ఇప్పటికైనా మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించి ఏటూరునాగారం ఐటీడీఏ పనితీరుపై సమగ్ర విచారణ జరపాలని, గత కొన్నేళ్లుగా విడుదలైన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి."గిరిజన అభివృద్ధి" పేరుతో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క వెంటనే స్పందించకపోతే, ఆదివాసీల్లో ఆగ్రహం మరింత ఉధృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## పిఒ లెనిన్ వత్సల్ టోప్పో పైనే ఆదివాసీల ఆశలు..

ఏజెన్సీ చట్టాలను అమలు చేయలేని గిరిజనాభివృద్ధి సంస్థగా ఐటీడీఏ ఉందని వినిపిస్తున్న విమర్శలకు నూతన పిఒ లెనిన్ వత్సల్ టోప్పో చెక్ పెట్టి, ఏజెన్సీ ప్రాంత ఆదివాసి,గిరిజనులు అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికకి ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుడతార అనేది లేదా అనేది ప్రతి ఒక్క ఆదివాసి మదిలో మేదులుతున్న వెయ్యి డాలర్ల ప్రశ్న..? అభివృద్ధికి కేటాయించిన నిధులు పారదర్శకంగా వినియోగించేలా నిష్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకుని ఐటీడీఏ పిఒ లెనిన్ వత్సల్ టోప్పో ఆదివాసీల అభివృద్ధికి, చట్టాల పరిరక్షణకు, ఆదివాసీలను అభివృద్ధి బాటలో నడిపించడానికి బిడి శర్మ, ఎస్ ఆర్ శంకరన్ లాంటి ఐఏఎస్ అధికారులు ఎనలేని సేవలు అందించారనే విషయం గుర్తెరిగి.. వారి బాటలో ముందుకెళ్తారని ఆదివాసి సంఘాల పెద్దలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గ్రామీణ మహిళలకు వరం

**గోవిందరావుపేట ప్రభాతవార్త.** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కర్లపల్లి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి శనివారం శంకుస్థాపన జరిగింది. తెలంగాణ రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింత క్రాంతి ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరి కాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు. మహిళా సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ భవనం మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు ఈక అప్పయ్య, సర్పంచ్ విజయ బాలరాజు, ఉపసర్పంచ్ హుసేన్, నాయకులు సమ్మయ్య, రాంబాబు, ప్రవీణ్, మల్లేష్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏటూరునాగారం వార్త

## .సైబర్ నేరాలకు అవగాహనే రక్షణ కవచం..

### పస్రా ఎస్సై తాజుద్దీన్




**గోవిందరావుపేట ప్రభాతవార్త.** సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పస్రా ఎస్సై తాజుద్దీన్ సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సరైన అవగాహన ఉంటే సైబర్ నేరాల బారిన పడే అవకాశం లేదని ఆయన తెలిపారు. సైబర్ నేరాలను ఎదుర్కోవడం చాలా సులభమని ఆయన అభిప్రాయపడ్డారు. మీ సన్నిహితులకు ఎప్పటికప్పుడు సైబర్ మోసాల గురించి చెప్పాలని ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఓటీపీ, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని తెలియని నంబర్ల నుంచి వచ్చే లింక్‌లు క్లిక్ చేయవద్దని,సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం బహిర్గతం చేయడం ప్రమాదమన్నారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చని అన్నారు.యువత సైబర్ సేఫ్టీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.అవగాహన లేకపోవడమే చాలా మంది మోసపోవడానికి కారణమన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోనూ సైబర్ అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు.పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై కనీస జ్ఞానం కలిగి అప్రమత్తతే మీ డబ్బు, డేటాకు రక్షణ కవచమని పస్రా మరియు మండలంలో సైబర్ నేరాల నివారణకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను అరికట్టగలమని చిన్న నిర్లక్ష్యం పెద్ద నష్టానికి దారి తీస్తుందని సురక్షితమైన డిజిటల్ జీవనం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్సై తాజుద్దీన్ పిలుపునిచ్చారు.

## పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం

ప్రభాత వార్త వాజేడు



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో విద్యా వారోత్సవాలల్లో భాగంగా ములుగు జిల్లా వాజేడు మండలంలో విద్య విజయోత్సవాలు నిర్వహించారు. ఇందులో పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వాజేడు మండలంలో 202526 విద్యా సంవత్సరంలో పాసైన విద్యార్థులలో మొదటి ముగ్గురు విద్యార్థులకు శాలు వా వేసి తల్లిదండ్రుల సమక్షంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రణాళిక వేసుకోవడం ఒక కష్టమైన పనిలా అనిపించవచ్చు కానీ సరైన కెరియర్ మార్గదర్శకత్వం మరియు ఆలోచనత్మకమైన విధానంతో విజయవంతమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి తేజవత్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు మార్గ నిర్దేశకులు అని పాఠశాల విద్యానుండే ఉన్నతంగా చదివి మంచి భవిష్యత్తుకును ఏర్పరచుకోవాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పోరిక స్వరూప్ సింగ్, శ్రీకాంత్, మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు



# బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**ప్రతి కార్యకర్తకు**

**అండగా ఉంటా : ఎమ్మెల్యే నాయిని**



మే 17, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్ :

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతున్న నేపథ్యంలో, ఆదివారం సాయంత్రం బాలసముద్రం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద నిర్వహించిన చేరికల కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు కొయ్యాడ కృష్ణ, మొర్రె శిల్ప తమ వందలాది మంది అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి హాజరై, పార్టీలో చేరిన నాయకులకు కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రతి వర్గానికి న్యాయం చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా చేరడం ఆనందకరమని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని, ఎవరికీ అన్యాయం జరగకుండా కాపాడుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రతి కార్యకర్త సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నాయకులు కొయ్యాడ కృష్ణ, మొర్రె శిల్ప మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వం మరియు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పట్ల యువతలో మరింత అవగాహన పెరగాలి

**అంతర్జాతీయ ఎయిడ్స్**

**క్యాండిల్ లైట్ ర్యాలీ,**

**హనుమకొండ జిల్లా వైద్య మరియు**

**ఆరోగ్య శాఖ అధికారి**

**డాక్టర్ అల్లెం అప్పయ్య**



హనుమకొండ, బ్యూరో మే 17: (ప్రభాత వార్త)

ఎయిడ్స్ పట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో మరింత అవగాహన పెంపొందించాలని హనుమకొండ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హనుమకొండ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వరకు కొవ్వొత్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘీభావ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ అల్లెం అప్పయ్య మాట్లాడుతూ, హెచ్ఐవీ/ఎయిడ్స్‌తో మరణించిన వారిని స్మరించుకుంటూ, ప్రజల్లో హెచ్ఐవీ/ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించడం, అలాగే హెచ్ఐవీతో జీవిస్తున్న వ్యక్తులు మరియు వారి కుటుంబ సభ్యులకు సంఘీభావం, అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని 1983 సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం నివాళులర్పణ కోసం మాత్రమే కాదని, వివక్ష అనే చీకటిని తొలగించి మానవత్వం అనే వెలుగును నింపే ఉద్యమమని పేర్కొన్నారు. హెచ్ఐవీ అవగాహన, నియంత్రణ, పునరావాస కార్యక్రమాల్లో ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ/ఎయిడ్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించి స్క్రీనింగ్ శాతాన్ని పెంచాలని, మొబైల్ టెస్టింగ్ వ్యాన్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారు ఏఆర్టీ మందులను క్రమం తప్పకుండా వినియోగించాలని, వారికి నిరంతర ఫాలోఅప్ సేవలు అందించాలని పేర్కొన్నారు. అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్ మోహన్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, టీబీ ఆసుపత్రి, సీహెచ్‌సీ పరకాలలో ఐసీటీసీ కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీలో హెచ్ఐవీ పరీక్షల సదుపాయం అందుబాటులో ఉందని, మొబైల్ వాహనం ద్వారా టెస్టింగ్, కౌన్సెలింగ్ సేవలు కూడా అందిస్తున్నామని చెప్పారు. టీబీ ఆసుపత్రిలో సంపూర్ణ సురక్ష కేంద్రం ద్వారా అవగాహన కార్యక్రమాలు, పరీక్షలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రభుదాస్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ శ్రీమతి స్వప్న మాధురి, డాక్టర్ గీత, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, శ్రీనివాస్, ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్ఐ సుధాకర్, ప్రసన్న కుమార్, సందెల శ్రీనివాస్, కమలాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగుల రాష్ట్రస్థాయి క్రీడా విజేతకు క్యాష్ అవార్డు

ధర్మసాగర్, మే 17 (ప్రభాతవార్త):



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థిని కేతన ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడల్లో ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో పతకాలు సాధించింది. 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్, జిగ్‌జాగ్ రన్నింగ్, చెస్ పోటీలలో ప్రతిభ చాటిన కేతనను తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో ప్రత్యేకంగా సన్మానించారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విద్యా విజయోత్సవం కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా కేతనకు రూ.10 వేల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, సెక్టోరియల్ అధికారులు, జిల్లా సమాజ చైతన్య సమన్వయకర్త సుమాదేవి, మండల విద్యాధికారి రామ్‌ధన్, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంగళ మురళి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# మాంట్ ఫోర్ట్ స్కూల్ క్రికెట్ అకాడమీవర్సెస్ వరంగల్ వారియర్స్

కాజీపేట మండల్ మే17(ప్రభాతవార్త)



ఫాతిమా నగర్ మాన్ ఫోర్ట్ స్కూల్ క్రికెట్ అకాడమీ వారు క్రికెట్ కోచ్ చిన్నపాక.కృష్ణ నిర్వహించిన అండర్ 12 ఇయర్స్ క్రికెట్ మ్యాచ్ లో పాల్గొన్న రెండు జట్లలో మాంట్ ఫోర్ట్ స్కూల్ క్రికెట్ అకాడమీ విజయం సాధించారు. వరంగల్ వారియర్స్ 12 ఓవర్స్, 89 రన్స్, మాన్ ఫోర్ట్ స్కూల్ క్రికెట్ అకాడమీ, 93 రన్స్, బి.సానరష్ కెప్టెన్, డి. సాంబశివుడు వైస్‌కెప్టెన్, 20, బాల్స్, 39 రన్స్, జె.అభినవ్ బాల్స్, 25, రన్స్ 29, బి.సుకృతి బాల్స్, 2, రన్స్, ఈ, హరిప్రీత్ బాల్స్, 8, రన్స్ 6, సమిత్, బాల్స్, 3, రన్స్ 4, నిహాల్ జె.శ్రీహాన్, కె.వినీత్, పి.శ్రేయాన్, జోషి ఎక్స్ ట్రా 10 రన్స్, మాన్ పోర్ట్ స్కూల్ క్రికెట్ అకాడమీ బౌలింగ్ శు శుక్రురుత్, ఓవర్స్ 3, వికెట్స్ 3, హరిప్రీత్ ఓవర్స్ 2, వికెట్స్ 2, జోషి ఓవర్స్ 3, వికెట్స్ 2, అభినవ్ ఓవర్స్ 3, వికెట్స్ 3, నిహాల్, 1, మాంట్ ఫోర్ట్ స్కూల్ క్రికెట్ అకాడమీ కోచ్ మాట్లాడుతూ చిన్నపాక.కృష్ణ, క్రికెట్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి గలవారు మాంట్ ఫోర్ట్ స్కూల్ సంప్రదించగలరని అన్నారు.




# పదవ తరగతి మండల స్థాయి 3వ టాపర్ కు సన్మానం

ధర్మసాగర్, మే 17 (ప్రభాతవార్త):



హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో చదివిన మ్యాకల శృతి మాధురి ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 518 మార్కులు సాధించి మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలలలో మూడో ర్యాంకు సాధించింది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శృతి మాధురిని ఘనంగా సన్మానించారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన విద్యా విజయోత్సవం కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి గిరిరాజ్ గౌడ్ ఆమెకు అభినందనలు తెలియజేసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, జిల్లా సమాజ చైతన్య సమన్వయకర్త సుమాదేవి, మండల విద్యాధికారి రామ్ ధన్, జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంగళ మురళి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా విజయోత్సవంలో పదవ తరగతి విద్యార్థులకు సన్మానం

ధర్మసాగర్,మే 17 (ప్రభాతవార్త):




తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో ఆదివారం దేవునూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా విజయోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పూలమాలలు వేసి, శాలువాలతో సన్మానించి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అతిథులు ఉపాధ్యాయులు ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హింఫెు రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీమతి సాంబలక్ష్మి ్మ, ప్రధానోపాధ్యాయులు పింగిలి సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు పద్మజ, భాస్కర్, శర్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జనగణన విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా. సత్య శారద**

**వర్ధన్నపేటలో సెన్సెస్ మార్నింగ్ వాక్, మానవహారం**

**దేశ అభివృద్ధికి, సంక్షేమ పథకాలకు జనగణనే కీలకం**

**హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సంయుక్తంగా పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్**

వర్ధన్నపేట/మే 17 ప్రభాతవార్త

దేశ ప్రగతికి, భవిష్యత్తు ప్రణాళికల రూపకల్పనకు అత్యంత కీలకమైన జనగణన (సెన్సెస్) ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు , వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. జనగణనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆదివారం వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన "సెన్సెస్ మార్నింగ్ వాక్",



మానవహారం ర్యాలీలను ఎమ్మెల్యే, కలెక్టర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పాలకుర్తి సారంగపాణి, స్థానిక సర్పంచ్‌లతో కలిసి ప్రారంభించి, విజయవంతం చేశారు. ప్రణాళికల రచనకు జనగణనే దిక్సూచి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అనంతరం స్థానిక ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జనగణన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జనగణన అనేది కేవలం అంకెలను సేకరించే ప్రక్రియ కాదని, దేశ సమగ్ర అభివృద్ధికి ఇది ఒక కీలకమైన పునాది అని , ప్రభుత్వాలు భవిష్యత్తులో ప్రజల అవసరాలను అంచనా వేయడానికి, వివిధ సంక్షేమ పథకాలను రూపొందించడానికి, బడ్జెట్ వనరులను సరైన రీతిలో పంపిణీ చేయడానికి ఈ సమాచారమే ప్రధాన ఆధారమవుతుందని, ప్రజలంతా ఎటువంటి అపోహలు లేకుండా, ఎనమ్యురేటర్లకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఖచ్చితమైన సమాచారంతోనే సంక్షేమంకలెక్టర్ డా. సత్య శారద ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ వద్దకు వచ్చే జనగణన సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జనగణన ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

**క్షేత్రస్థాయిలో హౌస్ లిస్టింగ్ పరిశీలన**

అవగాహన సదస్సు ముగిసిన అనంతరం, వర్ధన్నపేట పరిధిలో జరుగుతున్న జనగణన నిర్వహణలోని అత్యంత కీలకమైన 'హౌస్ లిస్టింగ్' (గృహాల గుర్తింపు) ప్రక్రియను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ డా. సత్య శారదలు సంయుక్తంగా పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, రికార్డులను తనిఖీ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, అయినవోలు టెంపుల్ చైర్మన్ ప్రభాకర్, పి.ఏ.సి.ఎస్ చైర్మన్ రాజేష్ కన్నా, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, డి.ఆర్.ఓ విజయలక్ష్మి ్మ, ఆర్డీవో సుమ, వర్ధన్నపేట తహసిల్దార్ విజయ్ సాగర్, పర్వతగిరి తహసీల్దార్ వెంకటస్వామి, రాయపర్తి తహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ జోనా, వివిధ శాఖల జిల్లా, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

**వరంగల్ వార్త**

## రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్

వరంగల్ క్రైం మే 17ప్రభాతవార్త



వరంగల్ డివిజన్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత ఆదివారం ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్స్ కాలనీ పరిధిలో అంతా కూడా శాంతియుతంగా ఉండాలని రౌడీ షీటర్లను హెచ్చరించారు. రౌడీ షీటర్లే కాకుండా ఎవరైనా సరే ఇక నుండి తగాదాల్లో ఇతర గొడవల్లో తలదూరిస్తే వారికి కఠిన చర్యలు తప్పవని సూచించారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరిగినా ప్రభుత్వం వ్యతిరేక కార్య కళాపాలు జరిగిన సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల పేర్లను గొప్యంగా ఉంచుతాని ఎలాంటి అపోహలు పడొద్దని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఇంచార్జ్ హనుమకొండ ఏసిపి నర్సింహా రావు, మిల్స్ కాలనీ సిఐ బొల్లం రమేష్,ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగిసిన విద్యా వారోత్సవాలు

వర్ధన్నపేట/మే 17 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల ముగింపు సమావేశం ఆదివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ పోచయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఈగ మల్లేశం మాట్లాడుతూ.. చదువు అనేది మనిషికి విజ్ఞానాన్ని, వినయాన్ని, సంస్కారాన్ని నేర్పుతుందని అన్నారు. విద్య కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకూడదని, సమాజంలో ఎలా మెలగాలో.. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా సొంత కాళ్లపై ఎలా నిలబడాలో నేర్పే దిక్సూచిలా చదువు ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షి ంచారు. కేవలం డిగ్రీ పట్టాలు సంపాదించడమే విద్య పరమార్థం కాదు. తోటి మనుషులతో సామరస్యంగా జీవించడం, ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవడం విద్యార్థులు అలవర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం ముఖ్య అతిథి ఈగ మల్లేశంను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నీటి పూర్వ సంఘం మాజీ చైర్మన్ అన్నమనేని మోహన్ రావు, వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి ఆర్.ఎమ్.ఓ డాక్టర్ భరత్ కుమార్, స్థానికులు కరిమిల్ల సంపత్ రావు, సంపత్ యాదవ్, పెద్దూరి రాజ్ కుమార్, రాజు, చెన్న శ్రీధర్, శ్రీనివాస్ లతో పాటు కళాశాల లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## చలో హైదరాబాద్ కు తరలివెళ్లిన కుమ్మరి సంఘం

వరంగల్ సిటి మే17 ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో 33 జిల్లాల కార్యవర్గ సమావేశం ఉస్మానియా యూనివర్సిటీ లో జరిగే సమావేశానికి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కుమ్మరి సంఘ నాయకులు, యువకులు తరలివెళ్లారు. దానిలో భాగంగా వరంగల్ జిల్లా యూత్ అధ్యక్షులు పోతుగంటి రాజశేఖర్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో సమావేశానికి హాజరైయ్యారు. ఈ సందర్భంగా కుమ్మరి సంఘ అభివృద్ధి, యువత పాత్ర, సంఘ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ వంటి పలు ముఖ్య అంశాలపై చర్చించారు. సమాజ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని నాయకులు పేర్కొంటూ, యువత సంఘ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘ అభివృద్ధికి కృషి చేస్తున్న నాయకులను అభినందించారు. ఓదెల చంద్రరావు, ఆవునూరి రామన్న తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

## నీటి సమస్యను పరిష్కరించండి

వరంగల్ సిటి మే17 ప్రభాతవార్త




వేసవి కాలంలో త్రాగునీరు అందించి వెంటనే సమస్య తీర్చాలని తెలంగాణ ప్రజాస్వామిక కార్మిక సంఘం డిమాండ్ చేశారు. అదివారం ఖిలా వరంగల్ పడమర కోట ప్రజలకు నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖిలా వరంగల్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు మైదం రవన్న మాట్లాడుతూ మహానగరం లో ప్రజలు త్రాగునీరు కు ఇబ్బందులు పడడం సిగ్గుచేటు అన్నారు. వరంగల్ ను రెండవ రాజదాని గా చెప్పుకుంటున్న ప్రభుత్వాలు ప్రజలకు త్రాగునీరు అందివ్వక పోవడం విడ్డూరం అన్నారు. వరంగల్ కోట ప్రజలకు నీరు రాక చాలా రోజులు ఇబ్బందులు ఎదుర్కొన్న పట్టించుకోవడం లేదని వెల్లడించారు. కనీసం ఐదు రోజులకు ఒక్కసారి కూడా రావడం లేదని వాపోతున్నారని తెలిపారు. గతంలో పడమర కోట ప్రజలకు దేశాయిపేట్ ఫిల్టర్ నేరుగా వచ్చేవి, ఇప్పుడు రంగశాయిపేట టాంకర్ మళ్లించడం వలన నీరు సమస్యలు తలెత్తున్నాయని పేర్కొన్నారు. ఇపపటికైన ప్రభుత్వ అధికారులు, కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోని నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నలుగంటి దయాకర్ శివ, ఇనుముల శ్రీనివాస్, గొర్రె రాజేష్, అశోకుడు, సంజీవ కేశపాక రాజు చేరాలు, సందీప్ తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన జంగా.రాఘవరెడ్డి

కాజిపేట్ మండల్ మే17(ప్రభాతవార్త)

కాజీపేట 47 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు విక్రాంత్ రావు ఇటీవలే గుండెపోటుతో మరణించిన విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురైజంగా. రాఘవరెడ్డి, వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాల వేసి



నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఆత్మీయంగా పరామర్శించారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబానికి మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షి ంచారు. పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో "పౌర సేవ" అభాసుపాలు..!!

**- ప్రహసనంగా మారిన "సిటిజన్ చార్టర్"..!**
**- గదిమాత్రమే ఉంది.. కంప్యూటర్లు, ఇంటర్నెట్ వసతులు శూన్యం**
**- ఇన్‌వర్డ్ ఎంట్రీలకే పరిమితం**
**- దరఖాస్తుల స్థితి తెలియక ప్రజల ఇబ్బందులు**

జనగామ, మే 17 ప్రభాతవార్త : ఒకవైపు ప్రభుత్వం డిజిటల్ తెలంగాణ, ఈ గవర్నెన్స్ అంటూ ప్రచారంచేస్తుండగా, క్షేత్రస్థాయిలోమాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాసేవలు నవ్వులపాలవుతున్నాయి. జనగామ మున్సిపల్‌కార్యాలయంలో ప్రజలకు పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలు అందించేందుకు ఏర్పాటుచేసిన పౌరసేవా కేంద్రం (సిటిజన్ చార్టర్) కేవలం కంటితుడుపు చర్యగానే మిగిలిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయ గోడలపై ఏసేవ ఎన్నిరోజుల్లో అందించాలనే వివరాలతో బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని అమలు చేయడానికి అవసరమైన కనీస మౌళికవసతులు మాత్రం కల్పించలేదు.

**- ఆధునిక యుగంలోనూ కాగితాల రాజ్యం..:**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల నుంచి కార్పొరేషన్ల వరకు ప్రభుత్వసేవలు ఎక్కువగా ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి వస్తున్నాయి. అయితే జనగామ మున్సిపాలిటీలో మాత్రం పరిస్థితి పూర్తిభిన్నంగా ఉంది. పౌరసేవలకోసం ప్రత్యేక గదిని



కేటాయించినప్పటికీ, అక్కడ కనీసం ఒక్కకంప్యూటర్, ప్రింటర్ లేదా ఇంటర్నెట్ కనెక్షన్ కూడా లేకపోవడం మున్సిపల్ యంత్రాంగ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. దేశంమొత్తం డిజిటల్ దిశగా అడుగులు వేస్తుంటే, ఇక్కడమాత్రం ఇంకాపాతకాలపు కాగితాల వ్యవస్థనే కొనసాగిస్తున్నారు.

**- ఇన్‌వర్డ్ ఎంట్రీలకే పరిమితమైన సేవలు..:**

పట్టణప్రజలు వివిధసమస్యలపై లేదా సర్టిఫికెట్లకోసం సమర్పించే దరఖాస్తులను కేవలం రిజిస్టర్‌లో నమోదుచేసి, ఇన్‌వర్డ్‌నంబర్ ఇవ్వడానికే ఈ కేంద్రం పరిమితమైందని ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ ట్రాకింగ్ సౌకర్యం లేకపోవడంతో, తమదరఖాస్తు ఏదశలో ఉందో, ఏఅధికారివద్ద ఫైల్‌పెండింగ్‌లో ఉందో తెలుసుకునేందుకు ప్రజలు కార్యాలయం చుట్టూ రోజులతరబడి తిరగాల్సివస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా జనన, మరణ ధృవీకరణపత్రాలు, ఇంటిపన్నుల మ్యుటేషన్, భవననిర్మాణ అనుమతులు, కొత్త నల్లా కనెక్షన్లు వంటి అత్యవసర సేవలకోసం వచ్చేప్రజలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతీచిన్న పనికి దళారులను ఆశ్రయించాల్సి వస్తోందని, లేదంటే టేబుల్‌కింద డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. బోర్డులపై పేర్కొన్న కాలపరిమితి కేవలం ప్రదర్శనకోసమే తప్ప, ఆచరణలో అమలుకావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**- నిధులున్నా.. నిర్లక్ష్యమెందుకు...?**

లక్షలాది రూపాయల మున్సిపల్ నిధులతో పట్టణఅభివృద్ధి చేస్తున్నామని చెప్పుకునే అధికారులు, ప్రజాసేవలకు అత్యంత కీలకమైన ఈకేంద్రానికి కనీసం రెండు కంప్యూటర్లు కూడా ఏర్పాటు చేయలేకపోవడంపట్ల స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. టెక్నాలజీని వినియోగించి ప్రజలఇబ్బందులను తగ్గించాల్సిందిపోయి, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఎందుకు వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

**- స్పందించాల్సిన సమయం ఆసన్నమైంది..:**

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, మున్సిపల్‌కమిషనర్ ప్రత్యేకదృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. జనగామ మున్సిపల్ పౌరసేవాకేంద్రంలో తక్షణమే ఆధునిక కంప్యూటర్లు, హైస్పీడ్ ఇంటర్నెట్ వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సింగిల్‌విండో విధానంలో ఆన్‌లైన్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చి, బోర్డులపై పేర్కొన్న కాలపరిమితిలోనే సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే లంచగొండితనానికి అడ్డుకట్టవేసి, పారదర్శక పాలన అందించాలని ప్రజలు విజ్ఞప్తిచేస్తున్నారు.

# విద్యుత్ సంస్థలో విభజనకు రంగం సిద్ధం

**- జిల్లాలో రైతుడిస్కం ఏర్పాటుకు వేగంగా చర్యలు**
**- వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల సర్వే ముమ్మరం**
**- జూన్ 2నుంచి పూర్తిస్థాయి కార్యకలాపాలకు సన్నాహాలు**

ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ రైతువిద్యుత్ పంపిణీ సంస్థ (రైతుడిస్కం) కార్యకలాపాల ప్రారంభానికి జనగామ జిల్లాలో అధికారులు వేగంగా చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి రైతుడిస్కం పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. జిల్లాలో రైతు డిస్కం పరిధిలోకి వచ్చే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల సర్వేపనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి, లింగాలఘనపూర్ మండలాల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు సేకరిస్తున్నారు. ప్రతీసెక్షన్‌కు ప్రత్యేక టీంలను నియమించి సర్వే చేపడుతున్నారు. రైతుడిస్కం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా అసిస్టెంట్ ఇంజినీర్లు తమపరిధిలోని వ్యవసాయ డీటీఆర్‌ల స్ట్రక్చర్, ఎంబోస్ నంబర్, నేమ్‌ప్లేట్ వివరాలను ఫోటోల రూపంలో నమోదుచేస్తున్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల జియో కోఆర్డినేట్లను కూడా సేకరిస్తున్నారు. ఇటీవల జిల్లావిద్యుత్ అధికారులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుడిస్కం ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, డీపీలు, విద్యుత్‌స్తంభాల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. జిల్లాలో ఇప్పటికే కొన్నిప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా ట్రాన్స్‌ఫార్మర్ల సర్వే విజయవంతంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. అసెట్ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ప్రభుత్వ



ఆదేశాల మేరకు రైతుడిస్కం కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఐతే ఇందులో ముఖ్యమైన అంశాల వివరాలు ఇలా ఉన్నాయి.. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల సర్వే వేగవంతం చేయడం, ప్రత్యేక యాప్ ద్వారా డేటా సేకరించడం, మండలాల వారీగా ప్రత్యేక బృందాల ఏర్పాటు, రైతు డిస్కం కార్యకలాపాలకు పూర్తిస్థాయి సన్నాహాలు, జూన్ 2నుంచి కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే రైతు డిస్కం లక్ష్యమని అధికారులు తెలిపారు.

--

# రైతులను ఇబ్బంది పెడితే కఠినచర్యలు

కొడకండ్ల, మే 17 ప్రభాతవార్త : కొడకండ్ల మండలంలోని పలుకొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. కేంద్రాల్లో కొనుగోలు తీరును నిశితంగా పరిశీలించారు. మండలంలోని ఏడునూతుల, పాకాల, రామవరం ధాన్యంకొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి తనిఖీచేశారు. కేంద్రాల్లోని తూకం యంత్రాలను స్వయంగా కలెక్టర్ తనిఖీచేశారు. రైతులు ప్రతీబస్తాకు రెండుకిలోలు ఎక్కువతూకం వేస్తున్నారని ఆయనకు ఫిర్యాదు చేశారు. దాంతో వారిసమక్షంలోనే ధాన్యంబస్తాలను తూకం వేయించి, తూకాల్లో తేడాలు గమనించి, ఇంకోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. అలాగే కొనుగోలుకేంద్రాల్లో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, గన్నీ బ్యాగుల లభ్యత, రైతులకు సంబంధించిన రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రాలవద్ద ఉన్నరైతులతో నేరుగా మాట్లాడి వారిసమస్యలను అడిగి తెలుసుకు న్నారు. తనిఖీచేసిన ఏకొనుగోలు కేంద్రంలో కూడా ఏపీఎం, సీసీలు అందు బాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. తాలు, తరుగుపేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని, ధాన్యంలో తేమశాతాన్ని సరిగ్గా పరీక్షించి వెంటనే కొనుగోలు ప్రక్రియపూర్తి చేయాలని కేంద్రాల నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బం




దులు కలగకుండా, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్‌మిల్లర్లకు తరలించేందుకు రవాణాలారీలు సదుపాయాన్ని మెరుగు పరచాలని, తూకం పూర్తయిన వెంటనే రైతులకు రశీదులు అందజేయాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ఉండేందుకు కేంద్రాలవద్ద టార్పాలిన్ పట్టాలను అందుబాటులో ఉంచాలని, రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని హెచ్చరించారు.




# ఏ వర్గానికి చైర్మన్ గిరి దక్కేనూ..?!

**- తమ వర్గానికే అవకాశం అంటూ పలువురు ఆశావహుల ప్రచారం**
**- గ్రామంలో జోరుగా రాజకీయ చర్చలు**
**- పదవులకోసం నాయకుల ప్రయత్నాలు**




బచ్చన్నపేట, మే 17 ప్రభాతవార్త : ప్రసిద్ధ శైవక్షేత్రంగా పేరుగాంచిన కొడ్వటూరు శ్రీ సిద్దేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవిచుట్టూ గ్రామంలో రాజకీయ చర్చలు జోరందుకున్నాయి. నేనే చైర్మన్.. మా వర్గానికే అవకాశం అంటూ పలువురు ఆశావహులు ప్రచారం ప్రారంభించడంతో దేవస్థాన వ్యవహారాలు హాట్ టాపిక్‌గా మారాయి. దేవస్థానం చైర్మన్, డైరెక్టర్ పదవులకోసం పలు వర్గాలకు చెందిన నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులతోపాటు స్థానిక ప్రభావశీలులు కూడా తమకే పదవి దక్కే అవకాశం ఉందని అనుచరుల వద్ద ప్రచారం చేస్తున్నారని గ్రామంలో చర్చ సాగుతోంది. దేవస్థానానికి మంచి ఆదాయం, భక్తుల ఆదరణ ఉండటంతో చైర్మన్ పదవికి ప్రాధాన్యం పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో వర్గ రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. కొందరు నాయకులు ఇప్పటికే తమ అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నట్లు సమాచారం. అయితే అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడకపోయినా, ఆశావహుల ప్రచారం మాత్రం రోజురోజుకు ఊపందుకుంటోంది. కాగా, చైర్మన్ గిరి ఏ వర్గానికి దక్కనుంది అన్నదే ప్రస్తుతం గ్రామంలో ప్రధాన చర్చగా మారింది. దేవస్థానం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అర్హులైన వారికి బాధ్యతలు అప్పగించాలని భక్తులు కోరుతున్నారు.

# చెత్తను కవర్‌లోనే వేయండి



నర్మెట, మే 17 ప్రభాతవార్త : ప్రజలు చెత్తను బహిరంగ ప్రదేశాలలో మోరీలలో వేయరాదని, కవర్లలోవేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్కు అందించాలని ఆగపేట సర్పంచ్ డాక్టర్ పగిడిపాటి రాజు కోరారు. గ్రామ స్థాపితం నూటనలభై సంవత్సరాల వార్షికోత్సవం నిర్వహించుకుంటున్న ప్రజలు క్లీన్ అండ్ గ్రీన్ పాటించాలని కోరారు. ఈ సందర్భంగా 120మైక్రాన్స్ నలుపురంగు కవర్లను ఆయన ఇంటింటికి ఆదివారం పంపిణీ చేశారు.

ఈ చెత్తకవర్లను పంచాయతీ ట్రాక్టర్ ద్వారా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామని ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అనిల్‌కుమార్, చర్చికమిటీ సభ్యులు యారవ సాల్మన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఆదూరు జయపాల్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, బాలిరెడ్డి, ప్రదీప్ రెడ్డి, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దేశ రైతాంగాన్ని మరోసారి మోసగించిన మోడీ ప్రభుత్వం

**-ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి**

నర్సంపేట,మే 17,ప్రభాతవార్త




కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు కానీ మద్దతు ధర ప్రకటించిందని ఇది రైతులను మరోసారి మోసం చేయడమేనని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి అన్నారు.ఆదివారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నర్సంపేట పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో సంఘ అధ్యక్షులు జక్కుల తిరుపతి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మామిడాల బిక్షపతి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతులకు మేలు జరగదని దుక్కి దున్నినప్పటి నుండి పంట చేతికి వచ్చేవరకు రైతాంగం అనేక రకాల పెట్టుబడులు పెట్టిందని ఈ సంవత్సర కాలంలో ఎరువులు పురుగు మందులు ఇతర అన్ని రకాల పెట్టుబడులు మరింత పెరిగాయని వాటికి అనుగుణంగా మోడీ ప్రభుత్వం రైతులు పండించిన పంటకు ప్రకటించిన మద్దతు ధర ఏమాత్రం సరిపోదని తిరిగి మరింత మద్దతు ధర ప్రకటించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గట్టి కృష్ణ, సహాయ కార్యదర్శి బొమ్మిడి సాంబయ్య, సభ్యులు ఐలయ్య, రమేష్, భద్రాజి కృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతో ప్రభుత్వ విద్యకు కొత్త దిశ

నర్సంపేట,మే 17,ప్రభాతవార్త




ప్రజా పాలనతో ప్రభుత్వ విద్యకు కొత్త దిశ అని ముగింపు సభలో ప్రొఫెసర్ మల్లం నవీన్ అన్నారు.ఆదివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల ముగింపు వేడుకలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో ఘనంగా నిర్వహించబడ్డాయి.కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నర్సంపేట మున్సిపాలిటీ 4వ వార్డ్ కౌన్సిలర్ బీరం భరత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జిజ్ఞాస పోటీలకు ఎంపికైన విద్యార్థి బృంద సభ్యులను,కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను, వివిధ సెంట్రల్ యూనివర్సిటీలలో ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా పత్రాలు,బహుమతులను అందజేశారు.ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు రాష్ట్ర,జాతీయ స్థాయిలలో ప్రతిభ చాటుతూ కళాశాలకు మంచి పేరు తీసుకువస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ కళాశాలలు కేవలం విద్య అందించే కేంద్రాలు మాత్రమే కాకుండా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విజ్ఞాన వేదికలుగా మారుతున్నాయని,గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సెంట్రల్ యూనివర్సిటీ ర్యాంకులు,జాతీయ స్థాయి క్రీడలు, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తుండటం ప్రభుత్వ విద్య యొక్క నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.కళాశాల తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. బైరి సత్యనారాయణ,సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం.సోమయ్య,డా. ఎం. రాంబాబు,అధ్యాపకులు,విద్యార్థులు,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలి

**-మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**

నర్సంపేట,మే 17,ప్రభాతవార్త



రైతు మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు.ఆదివారం నెక్కొండ మండలం అలంకాని పేట గ్రామానికి చెందిన మక్కజొన్న,వరి రైతు గాజుల పెద్ద వెంకటేశ్వర్లు మృతికి నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాపం తెలియజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నెలల తరబడి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యంతో రాత్రి పగలు పడిగాపులు కాస్తున్నారన్నారు.45 డిగ్రీల ఎండలో కాంటాల కోసం,బస్తాల కోసం ఎదురుచూస్తున్న రైతులు మనోవేదనకు గురిఅయ్యి మానసికంగా కృంగిపోతున్నారన్నారు.నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన గాజుల పెద్ద వెంకటేశ్వర్లు కొనుగోలు కేంద్రం వద్ద గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు.గాజుల పెద్ద వెంకటేశ్వర్లు రైతు వడ్ల కాంటా కోసం అలంకానిపేట కొనుగోలు కేంద్రం వద్ద రోజుల తరబడి ఎదురు చూసి అలిసిపోయి గుండెపోటుతో మృతి చెందడం జరిగిందన్నారు.రైతు మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి వారి కుటుంబానికి 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని ఈ సందర్భంగా కోరారు.కాపులకనపర్తి కొనుగోలు కేంద్రాన్ని వద్ద మక్కాజొన్నాలు అమ్మడానికి అలంకానిపేట కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు అమ్మడానికి నెలరోజులుగా తిరిగి అలిసిపోయిన వెంకటేశ్వర్లు,మానసిక వేదనతో మృతి చెందడం జరిగిందన్నారు.ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యనే.కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతుందని ప్రతిపక్ష పార్టీలు, రైతులు ధర్నాలు రాస్తారోకోలు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం వల్లనే ఈరోజు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద మృతి చెందే పరిస్థితి వచ్చిందన్నారు.సాగు విస్తీర్ణం పంటల దిగుబడి పైన ఏమాత్రం అవగాహన లేని ప్రభుత్వం, అధికారులు కొనుగోలు కేంద్రాలను పెంచకుండా రైతులను కష్టాలపాలు చేస్తూ అరిగోస పెడుతున్నాయన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న చిల్లర దందాలు,అవినీతి అక్రమాల వలన కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతున్నదన్నారు.ధాన్యం తరలింపు, గోదాముల నిలువ పైన అవగాహన లేని స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నవి దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాల న్నారు. వర్షాలు పడుతున్న ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదన్నారు.ఇప్పటికి కూడా కొనుగోలు కేంద్రాలను పెంచకపోవడం దురదృష్టకరంరెండు నెలలుగా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయలేక పోయింది ప్రభుత్వం,వడ్లను కొనుగోలు కేంద్రాలకు తెస్తున్న రైతులు అకాల వర్షాలు పడడంతో మానసిక వేదనకు గురి అవుతున్నారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వలన రైతులు విత్తనాలను మొదలుకొని కరెంటు,ఎరువులు,సాగునీరు,పంట కొనుగోలు ఇలా అన్ని దశలలోను అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా అలసత్వం వీడి కొనుగోలు కేంద్రాలను పెంచి తక్షణమే రైతుల ధాన్యాన్ని తరలించాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.

## ఆపదలో అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

నల్లబెల్లి, మే 17, ప్రభాతవార్త

అనారోగ్యంతో ఆపదలో ఉన్న నిర్భాగ్యులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి వెన్నంటి ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నల్లబెల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్ పేర్కొన్నారు.మండలంలోని నారక్కపేట గ్రామానికి చెందిన తిప్పని స్వరూప ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకోగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహాయ సహకారాలతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కు మంజూరి కాగా ఆ చెక్కును బాధిత కుటుంబానికి అందజేసినట్లు అశోక్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఆరోగ్య శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించే అవకాశాన్ని కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేశారు. .అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న ప్రతి వ్యక్తికి రాజకీయాలకు అతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకరిస్తున్నారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపతి సుమన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పోగుల కుమారస్వామి, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు కుంచాల రాజు, మాజీ ఉపసర్పంచ్ వడ్లూరు రమేష్,యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఎండి హాసన్,యూత్ నాయకులు కలిమి రాకేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




## ముదిరాజ్ కులస్తులను బిసి ఏ లో చేర్చవద్దు



నర్సంపేట,మే 17,ప్రభాతవార్త

ముదిరాజ్ కులస్తులను బిసి ఎలో చేర్చవద్దని అన్నారు.ఆదివారం నర్సంపేట గంగపుత్ర సంఘం అధ్యక్షులుగుంటి సంజీవ నర్సంపేట గంగపుత్ర సంఘం అధ్యక్షులు గుంటి సంజీవ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులను తెలంగాణ ప్రభుత్వం బీసీ ఏలో కలపడానికి చేస్తున్న ప్రయత్నలను తీవ్రంగా వ్యతిరేకించారు.బీసీ ఏ లో ఉన్న కులాలు వెనుకబడి ఉన్నారని ఉపాధి లేక జీవనోపాధి కరువై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,సంపన్న వర్గానికి చెందిన ముదిరాజులను కలపడం వలన మాకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం చేస్తుంది ప్రయత్నాలు మానుకోవాలని బీసీ ఏ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు.ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు ఎర్రబోయిన కిషన్,జీజుల సాగర్,బయ్య నారాయణ,పూస ఏకాంబరం, మేదరబోయిన సత్యనారాయణ,అంకాల సాంబయ్య,మల్లికార్జున్,మైస కుమార్ స్వామి,మేదరబోయిన శ్రీనివాస్,గుంటి శ్రీనివాస్, సందిరి దుర్గా స్వామి,కాపరబోయిన రమేష్,అంకాల సురేష్,అంబటి రవి పాల్గొన్నారు.

## మృతురాలు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నల్లబెల్లి,మే 17, ప్రభాతవార్త

మండలంలోని ముచింపుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాజు,రమేష్,తల్లి సరోజన ఆదివారం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించడంతో పాటు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు.వీరి వెంట బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్,ముచింపుల గ్రామ పార్టీ అధ్యక్షుడు కక్కర్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి సాంబయ్య,మాజీ అధ్యక్షులు పోరగాని మోహన్,సీనియర్ నాయకులు రవి,ఉపసర్పంచ్ దయాకర్,వార్డు సభ్యులు తాళ్లపల్లి మోనిక అనిల్ మేఘం, కొయ్యడ కుమారస్వామి, ఊట్కూరి రాజు,పసల స్వామి తదితరులున్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

దుగ్గొండి, మే 17, ప్రభాతవార్త



మండలంలోని ముద్దునూరం గ్రామానికి చెందిన ఈర్ల నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. పదో తరగతికి చెందిన తోటి మిత్రులు, కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎలా మృతిచెందారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదివేల రూపాయలు, 50 కేజీల బియ్యం అందించారు. ఈ పరామర్శలో కిషన్, అనిల్, యువరాజు, సుమన్, కుమార్, నాగరాజు, రవీందర్, సాంబరాజు, నవీన్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు హయాంలో ప్రజాస్వామ్య పాలన

-బిఆర్ఎస్ పాలనలో అరాచక పాలన సాగింది

-మండల కాంగ్రెస్ నాయకుల విమర్శ

మల్హర్‌రావు, మే 17, ప్రభాతవార్త



మండలంలోని రుద్రారం గ్రామంలో ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బడిదల రాజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఈజీఎస్ కౌన్సిల్ మెంబర్ దండు రమేష్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గంలో అరాచక పాలన సాగిందని తీవ్రస్థాయిలో విమర్శించారు. శనివారం రుద్రారంలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ సభలో మాజీ ఎమ్మెల్యే గతం మరచి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా అధికారంలో ఉన్న పుట్ట మధు కను సైగలలో ఇసుక, మట్టి దందాలు కొనసాగించడమే కాకుండా అడ్డొచ్చిన వారిపై భౌతిక దాడులు చేసిన మాట వాస్తవం కాదని ప్రశ్నించారు. నడిరోడ్డుపై న్యాయవాద దంపతుల హత్యలు మీ అరాచక పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా, శాంతియుతంగా జీవిస్తున్నారని అసలైన ప్రజాస్వామ్య పాలన ప్రస్తుతం అమలవుతుందని దండు రమేష్ అన్నారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ చంద్రగిరి సంపత్ మాట్లాడుతూ..బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ప్రయత్నిస్తే అడ్డుకున్నారని, దీనినే అంబేద్కర్ వాదం అంటారా అని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, గ్రామ సర్పంచ్ చంద్రగిరి సంపత్, ఉపసర్పంచ్ బడతల కుమారస్వామి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా విద్యా విజయోత్సవ వేడుకలు

మల్హర్‌రావు, మే 17, ప్రభాతవార్త



మండలకేంద్రమైన తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా చివరి(ఏడవ ) రోజైన ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల తాడిచెర్లలో విద్యా విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా2025 26 వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు ప్రిన్సిపాల్ విజయ దేవి పర్యవేక్షణలో అధ్యాపకులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీని స్వాగతిస్తున్నాం


ఎడ్యుకేషన్ కేయూ, మే 17 ప్రభాతవార్త :

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకోసం నియమించబడిన కమిటీని స్వాగతిస్తూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమకారులు ఆదివారం కాకతీయ విశ్వవిద్యాలయం గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుఅంశాలు, డిమాండ్లపై కులంకషంగా చర్చించారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఆయన క్యాంప్ ఆఫీసులోకలిసి పలుఅంశాలను నివేదించారు. ఈసందర్భంగా ఆయన సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకుపోతానని తప్పకుండా ఉద్యమకారుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పూర్వ కేయూ జేఏసీ చైర్మన్ డా.సాదు రాజేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను అధికారికంగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకకమిటీని ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమకారులు డా.చిర్రరాజు, డా.వలిఉలాఖద్రి, డా.ఫిరోజ్ పాషా, డా.మందవీరస్వామి, డా.సూత్రపు అనిల్, జోరికా రమేష్, డా.మెదారపు సుధాకర్, డా.పాలమాకుల కొమురయ్య, డా.రంజిత్, డా.మాధవి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డా.రాధిక, డాక్టర్ కాంతి, దుప్పటి కిషోర్ మధుకర్, డా.యాకుబ్‌రెడ్డి, డాక్టర్ నాగరాజు పటేల్, చిరంజీవి పాల్గొన్నారు.



## ఉన్నతవిద్యలో నాణ్యతహామీ నాక్ గుర్తింపుపై అవగాహన

ఎడ్యుకేషన్ కేయూ, మే 17 ప్రభాతవార్త :



తెలంగాణ రాష్ట్రప్రభుత్వ "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక - విద్యావారోత్సవాలు 2026"లో భాగంగా కాకతీయ విశ్వవిద్యాలయం అంతర్గత నాణ్యత హామీకేంద్రం (ఐక్యూఏసీ) ఆధ్వర్యంలో ఆదివారం గూగుల్‌మీట్ ద్వారా "ఉన్నతవిద్యలో నాణ్యతహామీ నాక్ గుర్తింపు" అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధి, నాణ్యతా ప్రమాణాల సాధనలో నాక్ గుర్తింపు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ నాక్ గుర్తింపు సాధనలో ప్రతీవిభాగం సమన్వయంతో పనిచేసి, కాకతీయ విశ్వవిద్యాలయాన్ని తెలంగాణలోనే కాక దేశవ్యాప్తంగా ఆదర్శవంతమైన విద్యాసంస్థగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రధానవక్తగా పాల్గొన్న ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం ప్రత్యేకాధికారి (ఓఎస్‌డీ) ఆచార్య ఆర్.వి.ఎస్.ఎస్.ఎన్.రవికుమార్ నాక్ గుర్తింపు ప్రక్రియలో ఎదురయ్యే పరిపాలనా, క్షేత్రస్థాయి సవాళ్లను వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య ఎస్.నరసింహాచారి కార్యక్రమ లక్ష్యాలను వివరించి విశ్వవిద్యాలయ నాణ్యతాభివృద్ధిలో నాక్‌గుర్తింపు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌ల ప్రాముఖ్యతను వెల్లడించారు.విశ్వవిద్యాలయ ప్రత్యేకాధికారి (ఓఎస్‌డీ) ఆచార్య బి.వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను మరింత పెంపొందించుకోవడానికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ నాక్ గుర్తింపు ప్రక్రియలను అత్యంత ప్రాధాన్యంతో అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ ఆన్‌లైన్ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విభాగాధిపతులు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్ల, పరిపాలనా అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి ఉండడం అవసరం

ఎడ్యుకేషన్ కేయూ, మే 17 ప్రభాతవార్త :



వరంగల్ నగరంలోని పిన్నవారివీధిలో ఉన్న ఆర్యసమాజ్ భవనంలో ఆదివారం బాలబాలికల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణశిబిరంలో కాకతీయ విశ్వవిద్యాలయ సహాయ రిజిస్ట్రార్ డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థులు పెద్దల పర్యవేక్షణలో పరిమిత కాలం మాత్రమే సోషల్ మీడియాను వినియోగించాలని సూచించారు. అలాగే సైబర్‌నేరాలపట్ల అవగాహన కలిగి ఉండడం వారికి ఎంతోఅవసరమని తెలిపారు. కార్యక్రమంలో బండి కిషన్, గన్ను జయప్రకాశ్, అల్లోజు వెంకటేశ్వర్లు, మాటేటి లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ వార్త

భూపాలపల్లి, కాటారం, ఏటూర్‌నాగారం, ములుగు

## ఎండ దెబ్బతో అంగన్వాడీ టీచర్ మృతి

గణపురం, మే 17, ప్రభాత వా



గణపురం మండలం బుద్ధారం బీసీ కాలనీ లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ చాగర్తి లత (35) వడదెబ్బతో ఆదివారం ఉదయం మృతి చెందింది. వివరాల ప్రకారం ప్రతిరోజు ఇంటి నుండి అంగన్వాడి సెంటర్ కి వెళ్లి గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందించి ఫోటోలు తీసుకునేది. ఈ క్రమంలో శనివారం అంగన్వాడి సెంటర్ లో గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందించి ఇంటికి వస్తున్న క్రమంలో అస్వస్థకు గురికాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. దీంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలకు భర్త రఘు. ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన అంగన్వాడి టీచర్ లత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని గ్రామ సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్. గ్రామస్తులు డిమాండ్ మండలం బుద్ధారం బీసీ కాలనీ లో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్ చాగర్తి లత (35) వడదెబ్బతో ఆదివారం ఉదయం మృతి చెందింది. వివరాల ప్రకారం ప్రతిరోజు ఇంటి నుండి అంగన్వాడి సెంటర్ కి వెళ్లి గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందించి ఫోటోలు తీసుకునేది. ఈ క్రమంలో శనివారం అంగన్వాడి సెంటర్ లో గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందించి ఇంటికి వస్తున్న క్రమంలో అస్వస్థకు గురికాగా కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. దీంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలకు భర్త రఘు. ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన అంగన్వాడి టీచర్ లత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని గ్రామ సర్పంచ్ విడిదినేని శ్రీలత అశోక్. గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## నగరంపల్లి లో ఘనంగా బోనాల పండుగ

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

గ్రామంలో పండుగ వాతావరణం

గణపురం, మే 17,ప్రభాతవార్త:



మండలంలోని నగరంపల్లి గ్రామంలో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మొదట గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్ళ మధ్య ఊరేగింపుగా తరలి వెళ్లారు. గ్రామంలోని భూలక్ష్మి ్మ, మా లక్ష్మి ్మ. పోచమ్మ దేవాలయం, పెద్దమ్మ తల్లి ఆలయం, బీరన్న గుడి వద్ద యాదవ కులస్థులు గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు ఎత్తుకుని గ్రామ వీధుల గుండా ఊరేగింపు కొనసాగింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ శాంతి, ప్రజల ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి కోసం బోనాల పండుగ నిర్వహించినట్లు శ్రీకృష్ణ యాదవ సంఘ సభ్యులు వంగ కుమారస్వామి యాదవ్ పెద్ద గొల్ల గొర్రె ఎల్లయ్య యాదవ్ సారగొల్ల లు తెలిపారు.



## గుక్కెడు నీటి కోసం తప్పని తిప్పలు

**-బేతోలు గ్రామంలోని ఎస్సీ కాలనీకి**

**మిషన్‌భగీరథ నీటిని అందజేయాలి**

**-ఖాళీ బిందెలతో మహిళల నిరసన**

మహబూబాబాద్ రూరల్,మే17,(ప్రభాతవార్త):



మహబూబాబాద్ మున్సిపాలిటి పరిధిలోని బేతోలు గ్రామం 6వ వార్డులోని ఎస్సీ కాలనీ ప్రజలు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని ఇతర ప్రాంతాలకు భగీరథ నీరు వస్తున్నప్పటికీ తమ కాలనీకి మాత్రమే నీటి సరఫరా నిలిచిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. గతంలో భగీరథ పైప్‌లైన్ కాలనీలో వేసినా కనెక్షన్ మాత్రం ఇవ్వలేదని దీంతో తాము నల్లాబావిపై ఆధారపడాల్సి దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ బావిలో కూడా నీటిమట్టం తగ్గిపోవడంతో నీరు దొరుకడం లేదని గుక్కెడు నీటి కోసం తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తక్షణమే సంబందిత అధికారులు చొరవ తీసుకొని మిషన్ భగీరథ నీటిని కాలనీకి సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖాదర్‌బాబా, సంతోష్, పీరయ్య, రాజు, శ్రీను, వేణు, ముత్తయ్య, ఉమ, పద్మ, నాగలక్ష్మి, రేణుక, చంద్రమ్మ, సుభద్ర, జయ తదితరులు పాల్గొన్నారు.

## హైపర్ టెన్షన్‌పై అప్రమత్తంగా ఉండాలి

**-ఘనంగా ప్రపంచ రక్తపోటు దినోత్సవం**

**-డాక్టర్ గుగులోతు రవి**



మరిపెడ,మే17,ప్రభాతవార్త:

హైపర్ టెన్షన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ వైద్యాధికారి డాక్టర్ రవి సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఆయన మాట్లాడుతూ హైపర్ టెన్షన్‌ను 'నిశ్శబ్ధ హంతకుడు'గా పేర్కొన్నారు. ఎలాంటి లక్షణాలు లేకపోయినా రక్తపోటు కారణంగా ప్రాణాపాయం కలుగవచ్చన్నారు. రక్తపోటు సాధారణ స్థాయి 120/80గా ఉండాలని 140/90గా ఉంటే హై బీపీగా పరిగణిస్తారన్నారు. 30ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు, పక్షవాతం, చూపు కోల్పోయే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. బీపీ నియంత్రణకు రోజువారి ఆహారంలో ఉప్పు తగ్గించడం, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం, ప్రతి రోజు కనీసం 30నిమిషాలు నడక/వ్యాయామం చేయడం అవసరం అన్నారు. దూమపానం, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, మానసిక ఒత్తిడిని తగ్గించుకొని సరిపడా నిద్ర తీసుకోవాలన్నారు. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడితే రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చున్నారు. ప్రజలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ఐవి బాధితులకు మద్ధతుగా నిలువాలి

మహబూబాబాద్ టౌన్,మే17,ప్రభాతవార్త:



హెచ్ఐవి బాధితులకు మద్ధతుగా నిలువాలని వారిపై వివక్షతను చూపరాదని డాక్టర్ అర్జున్‌నాయక్ అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్‌తో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకోవడంలో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుండి నెహ్రూ సెంటర్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ హెచ్ఐవి బాధితులకు అండగా ఉండేలా, వారిలోని అపోహను తొలగించడానికి, ఐక్యతను తెలుపడానికి ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. దిశా సిఎస్ఓ సారయ్య, ఐసిటిసి కౌన్సిలర్ రమేష్, ఎల్ఏసిప్లస్ స్టాఫ్ నర్సు జ్యోతి, మేనేజర్ రమేష్, సరస్వతి, గౌతమి, మానస, సర్వోదయ టీం, చైల్డ్ ఫండ్ ఎన్జీవో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## 20 ఏళ్ల తర్వాత కలిసిన దోస్తులు..

**జ్ఞాపకాల సందడిలో మునిగిన**

**మరిపెడ జెడ్పీహెచ్ఎస్ ప్రాంగణం**

**ఘనంగా 200506 బ్యాచ్**

**పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

మరిపెడ, మే 17 :(ప్రభాత వార్త);



స్నేహం అనేది జీవితంలో ఎన్నటికీ చెరిగిపోని అనుబంధం. బాల్యంలోని ఆటలు, పాటలు, చిలిపి జ్ఞాపకాలు, గురువుల మందలింపులు, సహపాఠులతో గడిపిన మధుర క్షణాలు ప్రతి ఒక్కరి మనసులో చిరస్థాయిగా నిలిచిపోతాయి. అలాంటి బాల్య స్నేహితులు ఇరవై ఏళ్ల తర్వాత ఒకేచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటే ఆ ఆనందానికి అవధులు ఉండవు.మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో చదివిన 200506 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న సహచరులు హోదాలు, బాధ్యతలు అన్నీ మరిచి చిన్ననాటి రోజుల్ని గుర్తు చేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు.పాఠశాల ఆవరణలో అడుగుపెట్టిన క్షణం నుంచి పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 20 సంవత్సరాల క్రితం తరగతి గదుల్లో గడిపిన రోజులు, స్నేహితులతో చేసిన సరదాలు, గురువుల బోధనలు, పరీక్షల అనుభవాలు గుర్తుచేసుకుంటూ కడుపుబ్బ నవ్వుకున్నారు. కొందరు భావోద్వేగానికి లోనై చెమ్మగిల్లిన కళ్లతో ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ముందుగా తమకు విద్యాబోధన చేసినప్పటికీ ప్రస్తుతం లేని గురువులు, అలాగే అదే బ్యాచ్‌కు చెందిన మృతిచెందిన మిత్రులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మోనం పాటించారు. అనంతరం మాట్లాడిన గురువులు విద్యార్థులందరూ సమాజంలో ఉన్నత స్థానాలు అధిరోహించి, మంచి పేరు సంపాదించాలని, తమ పిల్లల భవిష్యత్తును కూడా ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షి ంచారు.కార్యక్రమంలో ఆనాటి గురువులు, ప్రస్తుత పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం బయగాని రాంమోహన్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ భట్టార్, ఉపాధ్యాయులు వెంకటరాజు, అశోక్, వసుందర్, శ్రీదేవి, బయ్య ఉపేందర్, పోతుల గోవర్ధన్, అటెండర్లు సంజీవ్, ఏసయ్యలను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.అనంతరం పూర్వ విద్యార్థులందరూ సహపంక్తి భోజనాల్లో పాల్గొని ఉల్లాసంగా గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో షేక్ అన్వర్, వజ్జ సైదులు, గణేష్, ఐనాల నరేష్, బొజ్జ వీరన్న, రాంలాల్, సంతోష్, మంజుల, రాధిక, ఆసియా, మహేంద్ర, శిరీష, హరీష్, అనేష్, ఉపేందర్, సంజీవ్, మునీందర్, సురేష్, నల్ల నరేష్, నసీర్, నరేష్ రెడ్డి, లింగన్న, రాజేశ్వరి, ముంతాజ్, శ్రీలత, రజిత, భారతి, జ్యోతి, నాగలక్ష్మి ృ, వసంత, ఎలేంద్ర, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## మీసేవ సెంటర్ ప్రారంభించిన కాంటెస్ట్,కార్పోరేటర్,రాజారపు.స్వామి

కాజిపేట్ మండల్ మే17(ప్రభాతవార్త)



44 డివిజన్ నగరం కడిపికొండ ఇందిరమ్మ కాలనీ మురారి రాకేష్ మీసేవ సెంటర్,ఏర్పాటు చేశారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 44వ డివిజన్ అధ్యక్షులు కాంటెస్ట్ కార్పొరేటర్, రాజారపు. స్వామి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి మీసేవ ఆన్లైన్ సేవలు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు శ్రమశక్తి అవార్డు గ్రహీత సిఐటియు నగర,కార్యదర్శి,పంకెర్ల.కుమారస్వామి ఇందిరమ్మ కాలనీ గ్రామ అధ్యక్షులు, సిలువేరు.కరుణాకర్ కాలనీ పెద్దలుర్యాకల. సత్యం,బాంగ్యా.నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రాజారావు. కిరణ్, నాగపురి .శ్రీకాంత్, కుమారస్వామి ,బొందుగుల. శివ,చిరుత. శ్రీనివాస్,కాలనీ వాసులు పాల్గొన్నారు.




## ఇంటర్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన సిద్దిజైన్‌కు సన్మానం

గార్ల,మే17,(ప్రభాతవార్త:



జిల్లా కలెక్టరేట్‌లో ఆదివారం విద్యా వారోత్సవాలను ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని గార్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిసి ప్రథమ సంవత్సరం విద్యార్థిని సిద్దిజైన్ అత్యుత్తమ మార్కులుసాదించి జిల్లా టాపర్‌గా నిలువడంతో జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం ఎవరి విజయాన్ని ఆపలేవని కష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అదిరోహించవచ్చున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అదిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. జిల్లా అధికారులు, కళాశాల ప్రిన్సిపల్ రాజకుమారి, అద్యాపకులు రవీందర్, సత్యనారాయణ, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై బారం

బయ్యారం,మే17,ప్రభాతవార్త:



పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారం మోపిందని బిఆర్ఎస్ పార్టీ బయ్యారం మండల నాయకురాలు కల్పనసునీల్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీటితో పాటు ఎరువులపై కూడా ప్రభుత్వం ధరలు పెంచడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. వంటగ్యాస్, సిఎన్‌జి ధరలు కూడా పెంచి భారం మోపిందన్నారు. కేంద్రప్రభుత్వం పెంచిన ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని లేనియెడల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

## ఇంధన ధరల పెంపుతో ప్రజలపై భారం

**-సీపిఐ నిరసన**

మరిపెడ,మే17,ప్రభాతవార్త:




కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను పెంచి ప్రజలపై మరింత భారం మోపిందని సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.3, వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై రూ.100 పెంచడం ప్రజా వ్యతిరేక చర్య అన్నారు. ధరల పెంపుతో సామాన్య ప్రజలు, వాహనదారులు, చిన్నవ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, అంజి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**ఎమ్మెల్సీ రవీందర్ రావు**

నెల్లికుదురు మే 17 ప్రభాతవార్త :

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో సైతం అద్భుతంగా రాణించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఎమ్మెల్సీ తక్కల్లపల్లి రవీందర్ రావు అన్నారు ఆదివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 2026 విద్యా వారోత్సవాల విజయోత్సవంలో భాగంగా 10వ



తరగతి, ఇంటర్మీడియట్ జిల్లా టాపర్లను, జాతీయ స్థాయి ఆటల పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు జడ్పిహెచ్ఎస్ ఆలేరు ఉన్నత పాఠశాల లో 9వ తరగతి చదువుతున్న బానోతు యశ్వంత్ ఇటీవల భువనేశ్వర్ లో నిర్వహించిన జాతీయస్థాయి రబ్బీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు చేతుల మీదుగా రూ“ 10 వేల నగదు తో పాటు జ్ఞాపిక అందజేశారు ఈ కార్యక్రమంలో డి ఈ ఓ సత్యనారాయణ మూర్తి, ఎంఈఓ రామదాసు, ఎస్ జి ఎఫ్ ఐ సెక్రెటరీ గండి సత్యనారాయణ, ఎస్ జి ఎఫ్ అసిస్టెంట్ సెక్రటరీ ఐలయ్య, ఫిజికల్ డైరెక్టర్ మహమ్మద్ ఇమామ్ విద్యార్థి తల్లిదండ్రులు బానోత్ యాకు దంపతులు పాల్గొన్నారు

# విచ్చలవిడిగా సిట్టింగులు

**లైసెన్స్ లేకుండానే ఆహార పదార్థాల అమ్మకాలు**

**తాగు నీరు, టాయిలెట్స్.. సదుపాయాలు కరువు**

**ఎక్సైజ్, పోలీసు శాఖ తనిఖీలు లేక ఇష్టారాజ్యం**

( పరకాల ప్రభాత వార్త )

వైన్స్ల పరిధిలో పర్మిట్ రూంలకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వాలు, ఇదే సమయంలో వీటి నిర్వహణకు కొన్ని నిర్దిష్ట నిబంధనలు పెట్టాయి. వాటిని పకడ్బందీగా అమలు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టమైన ఆదేశాలున్నాయి. అయితే అడుగడుగునా ఆ నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. నిజానికి పర్మిట్ రూంల నిబంధనలను పరిశీలిస్తే.. పర్మిట్ రూం ఓ చిన్న బెడ్రూం అంతా స్థలంలో మాత్రమే వైన్స్ దారులు నిర్వహించాలి. బార్లకు వెళ్లలేని నిరుపేద వర్గాల్లోని మద్యం ప్రియులు వైన్స్ లో కొనుక్కొని, దాని పరిధిలోనే తాగి వెళ్లాలన్న ఉద్దేశంతో ఈ పర్మిట్ రూంలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అందులో కుర్చీలు, టేబుళ్లు వేయరాదు. అలాగే అక్కడ వంటలు చేయడానికి, ఆహార పదార్థాలు విక్రయించడానికి అనుమతి లేదు. వెజ్, నాన్వెజ్ వంటి ఐటమ్స్ను ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టకూడదు. ఒక్క మాటలో చెప్పాలంటే.. మద్యం ప్రియులు అక్కడ కూర్చోవడానికి ఎటువంటి సౌకర్యాలు కల్పించేందుకు వీలులేదు. కేవలం తాత్కాలికంగా నిలబడి మాత్రమే తాగి వెళ్లాలి. వైన్స్ దుకాణానికి ఆనుకొని మాత్రమే పర్మిట్ రూం ఉండాలి. అలాగే విద్యాసంస్థలు, దేవాలయాలకు వంద



మీటర్ల పరిధిలో ఉండరాదు. పర్మిట్ రూం పరిధిలో కేవలం తాగునీటి సౌకర్యంతోపాటు ప్యాకేజీ ఫుడ్ (కారా, చిప్స్, పల్లీలు, పుట్నా ల వంటి ప్యాకెట్లు మాత్రమే) అందుబాటులో ఉండేలా నిబంధనలున్నాయి.

**నిబంధనలకు విరుద్ధంగా దందాలు...**

పేదలను దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన పర్మిట్ రూంలను కొంతమంది వైన్స్ దారులు తమ వ్యాపార సామ్రాజ్యాలుగా మార్చుకున్నారు. వాటిని రోజురోజుకూ విస్తరిస్తున్నారు. కొంతమంది అయితే దాదాపు అరఎకరం స్థలంలో పర్మిట్ రూంలు నడుపుతూ యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. వాస్తవానికి పర్మిట్ రూంలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా.. లేదా..? అన్న దానిపై ఎక్సైజ్ అధికారులు నిరంతరం తనిఖీలు చేయాలి. ఎవరైనా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ, మామూళ్ల మత్తుకు అలవాటు పడిన అధికారులు.. అక్రమార్కులకు వంత పాడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అక్రమ దందాలకు పాల్పడుతున్న పర్మిట్రూం నిర్వాహకులు ఒక్కొక్కరి నుంచి నెల నెల మామూళ్లు ఎక్సైజ్ శాఖ అధికారులకు ముడుతున్నట్టు తెలుస్తున్నది. అంతేకాదు, 5గుంటల నుంచి 20 గుంటల స్థలంలో నడిపే కొంత మంది వ్యాపారులు నెల నెల మామూళ్లు ముట్టజెప్పుతున్నట్టు తెలిసింది. అధికారులు లంచాలకు తలొగ్గి నెలనెలా వచ్చే ముడుపులను జేబులో వేసుకుంటున్న తీరును అలుసుగా తీసుకుంటున్న పలువురు వ్యాపారులు చెలరేగిపోతున్నారు. ఇదే అదనుగా కొంత మంది పర్మిట్ నిర్వాహకులు తమ వ్యాపారాలను రోజురోజుకూ విస్తరిస్తూ 'మూడు పూలు.. ఆరు కాయలు'గా నడుపుతున్నారు. పరకాల పట్టణంలో కొంతమంది వైన్స్ దారులు పర్మిట్ రూంల పేరిట దాదాపు అర ఎకరం స్థలంలో దందా నడుపుతుండడమే దీనికి నిదర్శనం. మరికొంత మంది 5 నుంచి 20 గుంటల స్థలంలో నడుపుతున్నారు.

**మటన్, చికెన్ అన్నీ అక్కడే...**

పర్మిట్రూంల వద్ద చిప్స్, పల్లీలు, కార తదితర వంటి వాటిని మాత్రమే విక్రయించాలి. కానీ, ఏకంగా వంట గదులు ఏర్పాటు చేసి అన్ని రకాల ఫుడ్ పెడుతున్నారు. వెజ్, నాజ్ వెజ్తోపాటు స్నాక్స్ వంటి రకరకాల ఫుడ్ అందిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే బార్ అండ్ రెస్టారెంట్లో ఎటువంటి ఐటమ్స్ అందుబాటులో ఉంటాయో.. అదే తరహాలో పర్మిట్ రూంల్లోనూ అందిస్తున్నారు. ఇక్కడ ఫుడ్ ఐటమ్స్ ధరలు బార్లతో పోలిస్తే తక్కువగా ఉంటున్నాయి. ఎటువంటి తనిఖీలు లేకపోవడంతో నాసిరకం ఫుడ్ ఐటమ్స్ పెడుతున్నట్టు తెలుస్తున్నది. మద్యం ప్రియులు ఇవేమీ గమనించకుండా తినడం వల్ల అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రధానంగా పర్మిట్ రూంలకు యూత్ అట్రాక్ట్ అవుతున్నది. నిబంధనల ప్రకారం పర్మిట్ రూంలకు 21ఏళ్లలోపు ఉన్న యువతీయువకులను అనుమతించడానికి వీలులేదు. కానీ, స్టూడెంట్స్ను వచ్చినా పెద్ద పీట వేసి స్వాగతం పలుకుతున్నారు. వయసుతో నిమిత్తం లేకుండా.. చిన్న పెద్దా అనే విషయాన్ని పట్టించుకోకుండా.. పర్మిట్రూంల్లోకి అనుమతిస్తూ మందు సరఫరా చేస్తున్నారు. సారా, గుడుంబా వంటి విక్రయాలు చాటుమాటుగా చేస్తేనే వారిపై నిఘావేసి పట్టుకునే ఎక్సైజ్ అధికారులు.. నిబంధనలకు విరుద్ధంగా అది కూడా పట్టణ నడిబొడ్డున పర్మిట్ రూంలను యథేచ్ఛగా నడుపుతున్నా ఏనాడూ వాటిని ముట్టుకోకపోవడం వెనుక నెలనెలా చేతులు మారుతున్న మామూళ్లే కారణం అన్న విమర్శలున్నాయి.

# అంబటిపల్లిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**నలుగురు అరెస్ట్, నగదు, ఫోన్లు స్వాధీనం...**

**మహాదేవపూర్ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా..**

**పక్కా సమాచారంతో దాడులు...**

మహాదేవపూర్, మే 17, ప్రభాతవార్త

మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం..అంబటిపల్లి గ్రామ పరిధిలో కొందరు వ్యక్తులు చేరి జూదం (పేకాట) ఆడుతున్నట్లు పోలీసులకు ఖచ్చితమైన సమాచారం అందింది. ఈ మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సదరు స్థావరంపై అకస్మాత్తుగా దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,100/ ల నగదుతో పాటు, 4 సెల్ఫోన్లు, ప్లాస్టిక్ ప్లేయింగ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

# తొర్రూరు వార్త

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

నెల్లికుదురు మే 17 ప్రభాతవార్త :



మండలంలోని మునిగల వీడు జిల్లా పరిషత్ హై స్కూల్ లో 1991 92 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో గెట్ టు గెదర్ నిర్వహించుకున్నారు 33 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న మిత్ర బృందం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఆప్యాయతగా పలక రించుకున్నారు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకొని పరస్పరం వారి భావాలను పంచుకున్నారు విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఆత్మీయతతో ఘనంగా సత్కరించుకున్నారు తాము చదువుకున్న తరగతి గదులు, క్రీడామైదానం అన్నీ కలియ తిరుగుతూ మురిసిపోయారు రోజు మొత్తంలో తమకు ఉన్న సమస్యలను పనులను ఇబ్బందులను అన్ని పక్కన పెట్టి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు దేశబోయిన వీరమల్లు, రాగి వీరభద్రా చారి, రామానుజచార్యులు, లక్ష్మయ్య పూర్వ విద్యార్థులు గొల్లపల్లి విజయ్ బాబు, గంగుల శ్రీను,రాస వెంకటరెడ్డి, నాగబెల్లి సోమయ్య, రమేష్, నల్లాని పాపారావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి బియ్యం అందజేత

నెల్లికుదురు మే 17 ప్రభాతవార్త :

మండలంలోని బ్రాహ్మణ కొత్త పల్లి గ్రామానికి చెందిన తాళ్ల వీరయ్య అనారోగ్య కారణాల వల్ల ఇటీవల మృతి చెందగా ఎన్ జి ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి వారి కుమారులకు 50 కేజీల బియ్యం అందజేశారు ఈ సందర్భంగా సంస్థ ప్రధాన కార్యదర్శి తాళ్ల మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ఒక కుటుంబ పెద్ద వారి మధ్యలో నుంచి దూరమైతే ఆ బాధ వర్ణించలేమని వారు లేని లోటు కుటుంబానికే తెలుస్తుందని ఆయన మృతి విచారకరమన్నారు వారి పదవరోజు కార్యక్రమంలో పదిమందికి భోజనం పెట్టే విధంగా వారికి బియ్యం అందజేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు బొల్లు మురళి, పిడుగు యాకయ్య, సంస్థ ప్రతినిధులు సుమన్, ఉపేందర్, అజీమ్, ఉమేష్, నవీన్, సాయి కృష్ణ, గ్రామస్తులు ప్రశాంత్, ప్రవీణ్, విష్ణు, సోమయ్య తదితరులు ఉన్నారు



# బిటి వేయరు...ప్రమాదాలు ఆగవు..!

## బొద్దుగొండ ఎన్‌హెచ్‌పై మరో కారు బోల్తా

## గేదెలపైకి దూసుకెళ్లిన కారు

## తప్పిన భారీ ప్రమాదం

## ఎన్‌హెచ్ అధికారుల తీరుపై ఆగ్రహం

*గూడూరు, మే 17, ప్రభాతవార్త*

మండలంలోని బొద్దుగొండ జాతీయ రహదారిపై మరో కారు ప్రమాదం జరిగింది. గ్రామ సమీపంలో ఎన్‌హెచ్‌పై అసంపూర్తిగా గోతుల మయంగా ఉన్న రోడ్డు వద్ద మహబూబాబాద్ వైపు నుండి వస్తున్న కారు అదుపుతప్పి ఫల్టీలు కొడుతూ రోడ్డు పక్కన ఉన్న ఇళ్లవైపు దూసుకెళ్లింది. ఓ ఇంటి ముందు కట్టి ఉన్న గేదెలపై కారు పడడంతో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందగా మరో మూడు గేదెలకు నడుములు విరిగి కదలకుండా పడిపోయాయి. ఫల్టీలు కొట్టిన కారు నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు చిన్నపిల్లలతో సహా ఐదుగురు స్వల్పగాయలతో ప్రాణాపాయ స్థితి నుండి బయటపడ్డారు. ఈ సంఘటన శనివారం అర్థరాత్రి దాటిన తర్వాత 1.30 గంటల సమయంలో జరిగింది. కారు బోల్తా కొట్టిన భారీ శబ్దానికి లేచి బయటకొచ్చిన గ్రామస్తులు కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి వైద్య చికిత్సకై తరలించారు. ఏడు సంవత్సరాల క్రితం కంబాలపల్లి నుండి గూడూరు మీదుగా మంగళవారిపేట వరకు ఎన్‌హెచ్ పనులు చేపట్టగా ఇప్పటికీ సంబంధిత పనులు నత్తనడకన కొనసాగు'తూనే ఉన్నాయి. బొద్దుగొండ గ్రామం వద్ద మహబూబాబాద్ రోడ్డుకు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కొన్ని మీటర్ల మేర రోడ్డుపై బిటి వేయకుండా ఆపివేసారు. అక్కడ తరచుగా రోడ్డు కంకర తేలి గోతులమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. జాతీయ రహదారి భావనతో వేగంగా వెళ్లే వాహనదారులు తరుచుగా ఈ రోడ్డు వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. కార్లతో పాటు భారీ వాహనాలు కూడా ఈ రోడ్డు పుణ్యమా అని ఇక్కడ బోల్తా కొట్టిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అదృష్టవశాత్తు వాహనదారులు ఈ ప్రమాదాల నుండి ప్రాణాలతో బయటపడుతున్నప్పటికీ ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లవారు మాత్రం ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయంతో రాత్రిళ్లు గడుపుతున్నారు. ఇక్కడ జరిగే ప్రమాదాలు కూడా రాత్రి వేళల్లోనే జరుగుతున్నాయి. వాహనదారులు సమీపంలోకి వచ్చేంతవరకు రోడ్డు బాగాలేని విశయం గుర్తించని పరిస్థితుల్లో ఒక్కసారిగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు బాగు చేయడంలో ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్లు చూపుతున్న నిర్లక్ష్యంపై గ్రామస్తులు మండిపడుతున్నా, మీడియా ఎండగడుతున్నా పట్టించుకున్న పరిస్థితి కనిపించడంలేదు. నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుకు తరచుగా ఇక్కడ జరిగే ప్రమాదాలే నిదర్శనం. ఈ రోడ్డు దుస్థితి గురించి స్థానికుడైన అడ్వకేట్ కళ్యాణ్ ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రెండేళ్లు గడుస్తున్నా ఎలాంటి ఫలితం లేక పోగా తాజా జరిగిన ప్రమాద సంఘటనతో ఆయన కుటుంబానికే నష్టం జరిగింది. ఖమ్మం జిల్లా దానవాయిగూడెంకు చెందిన ఓ కుటుంబం మేడారం వెళుతున్న క్రమంలో శనివారం అర్థరాత్రి దాటిన తర్వాత బొద్దుగొండ వద్ద గోతులమయంగా ఉన్న రోడ్డుపై ప్రమాదానికి గురై ఫల్టీలు కొడుతూ నంద్యాల కళ్యాణ్ ఇంటివైపుకు దూసుకువెళ్లి అక్కడ కట్టేసి ఉన్న గేదెలపై పడడంతో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మరో మూడు గేదెలు నడుములు విరిగి అచేతనావస్థకు చేరిపోయాయి. ఈ సంఘటన వల్ల తమకు రెండున్నర లక్షల నష్టం వాటిల్లిందని కళ్యాణ్ కుటుంబం వాపోయింది. ఈ రోడ్డు వద్ద వేగంగా వస్తున్న వాహనాలు ఏకంగా గాలిలోకి ఎగిరిపడడం తప్ప ఇప్పటి వరకు మామూలు ప్రమాదమంటూ జరగలేదు. ఇలాంటి ప్రమాదాలు జరుగుతూ ఉన్నా పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డును వెంటనే బాగుచేయించాలని బొద్దుగొండ వాసులతో పాటు వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



## పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్

*పరకాల మే 17 (ప్రభాత వార్త)*



పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దురదృష్టి లేకపోవడం వల్లనే నేడు దేశంలో చమురు సంక్షోభం ఏర్పడిందని, గత పది సంవత్సరాల నుండి బ్యారెల్ ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించకుండా పెట్రోల్ కంపెనీలు లాభాలు అర్జించి నేడు రెండు నెలలోనేనష్టాలు పేరుతో పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం తుగ్లక్ చర్యని వెంటనే పెంచిధరలను తగ్గించి ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. అమెరికా, ట్రంప్ఒత్తిడికి తలోగ్గి మోడీ రష్యా నుండి చమురు కొనుగోలును తగ్గించడం వల్లే ఈ సమస్య ప్రధాన కారణమని, మోడీతన స్నేహితుడైన ఆదానిని రక్షి ంచడానికి దేశ విదేశాంగ విధానాన్ని, దౌత్య నీతిని,ట్రంప్ కు దాసోహమై దేశ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.గత కాంగ్రెస్ ప్రభుత్వంలో చమురుబారెల్ ధర బిజెపి ప్రభుత్వంతో పోల్చుకుంటే ఎక్కువగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ హయాంలో పెట్రోల్ డీజిల్ ధరలు తక్కువ ఉండేదని కానీ బిజెపి ప్రజల కోసం చేస్తున్నానని చెప్పి పెట్రోల్ డీజిల్ ధరలను 100 రేట్లు పెంచడం వెనకాల మోడీ బిజెపి ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ల కోసమే పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుందని ప్రజలు తిరుగుబాటు చేయకుండా మతము, జై శ్రీరామ్ పేరుతో చేసే రాజకీయాలు ఎల్లప్పుడు పనిచేయవని అదే జైశ్రీరామ్ పేరుతోటి ప్రభుత్వం నష్టాలను భరించి ప్రజలను కాపాడాలని కోరారు.

## తెలంగాణ ఉద్యమకారుల గౌరవానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం

### జిల్లా కార్యదర్శి పాడి కల్పనాదేవి

*పరకాల మే 17 (ప్రభాత వార్త )*



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సాధనలో కీలక పాత్ర పోషించిన తొలి, మలిదశ ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పాడి కల్పనాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, గుర్తింపు, గౌరవ పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే చర్య అని ఆమె అభినందించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు చేసిన త్యాగాలను, పోరాటాలను అధికారికంగా గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేయడం ఉద్యమకారులకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అనేక మంది యువకులు ప్రాణత్యాగాలు చేయగా, మరికొందరు పోలీసు కేసులు, జైలు జీవితం, శారీరకమానసిక ఇబ్బందులను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. అలాంటి ఉద్యమకారులకు గుర్తింపు కల్పించాలనే డిమాండ్ ఎన్నో ఏళ్లుగా కొనసాగుతుండగా, సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వారి సేవల ప్రామాణికత నిర్ధారణ, సంక్షేమ చర్యల రూపకల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పరిపాలన శాఖ ద్వారా జీఓ ఆర్టీ నం.679 జారీ చేసినట్లు చెప్పారు.ఉద్యమకారులను గుర్తించేందుకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి, అర్హులైన వారికి గౌరవం, సంక్షేమ సదుపాయాలు కల్పించే దిశగా కమిటీ సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తుందన్నారు.




## మృతుడి కుటుంబానికి సాయం

*గూడూరు, మే 17, ప్రభాతవార్త*

గూడూరుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త తంగళ్లపెల్లి వెంకన్న ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో



ఆదివారం పరామర్శించారు. ఆయన చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్ తన వంతు సాయంగా వెంకన్న కుటుంబ సభ్యులకు రూ.5వేలు అందజేయగా ఇతర నాయకులు బియ్యం అందజేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, నాయకులు వాంకుడోతు కొమ్మాలునాయక్, బీరం శ్రీపాల్‌రెడ్డి, జమ్ముల హేమలతారెడ్డి, ఉపసర్పంచ్ చంటి స్వామి, అర్రెం వీరస్వామి, రాసమల్ల యాకయ్య, ఎలమందల శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## అడ్మిషన్స్ కు దరఖాస్తులు ఆహ్వానం

*కేసముద్రం, మే 17, ప్రభాతవార్త*

మండలంలోని కల్వల ఆదర్శ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈనెల 25 లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ పరిమి నవీన్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 13 నుంచి కొనసాగుతున్నదని, ఎంపికైన విద్యార్థుల జాబితాను మే 27న ప్రకటించి 28 నుంచి 30 వరకు ధృవపత్రాల పరిశీలనతో పాటు ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాశాలలో ఎంపీసీ,బైపిసిసిఇసి,ఏసి ఈ, కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఏసిఈ గ్రూపులో అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులు బోధించబడతాయని తెలిపారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని, బాలికల కోసం 100 మందికి ఉచిత హాస్టల్ సదుపాయం ఉన్నందున జిల్లాలో ఏ ప్రాంతానికి చెందిన విద్యార్థులైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు.ఉచిత విద్యతో పాటు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.



## వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుకు బర్రె బలి

### గుడి సమీప అడవుల్లో దారుణం

*కొత్తగూడ మే 17 ప్రభాత వార్త :*

మండలం గుంజేడు ముసలమ్మ దేవస్థాన పరిసర అడవుల్లో వేటగాళ్ల ఆగడాలు మితిమీరాయి. అడవి జంతువుల కోసం కొందరు కిరాతకులు అమర్చిన విద్యుత్ ఉచ్చులో పడి స్థానిక రైతు బిజ్జ వెంకన్నకు చెందిన బర్రె ప్రాణాలు కోల్పోయింది. తునికి ఆకు సేకరణ కోసం అడవిలోకి వెళ్లిన కూలీలకు ఈ బర్రె కళేబరం కనిపించడంతో అసలు విషయం వెలుగులోకి



వచ్చింది. లైవ్ కరెంట్ తీగలను గమనించిన కూలీలు అప్రమత్తం కావడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. సమీపంలో లభ్యం అయిన జంతు కళేబరం అధికారులు తక్షణమే స్పందించి వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# విద్యార్థుల భవిష్యత్తులో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

**-విద్యతోనే మంచి భవిష్యత్తు**

**-జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్,**

**ఎమ్మెల్సీ రవీందర్‌రావు**



**మహబూబాబాద్ టౌన్,ప్రభాతవార్త:**

విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ అన్నారు. ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలను ఆదివారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల పురోగతిలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయం అన్నారు. ప్రతి విద్యార్థి నాణ్యమైన విద్యను పొందేలా జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విద్యార్థులకు కలెక్టర్ తన సొంత ఖర్చులతో నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఉన్నత విలువలతో కూడిన విద్యను ప్రతి ఒక్కరికి అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.

-ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ..

పేద బిడ్డలు చదువుకుంటున్నందున ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుండే కష్టపడి చదివితే జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటానని అదేవిధంగా విద్యా, వైద్యం లాంటి సేవ రంగాల అభివృద్ధికి మేము రాజకీయాలకు అతీతంగా కృషిచేస్తామని, డ్రగ్స్, గంజాయి లాంటి వాటికి విద్యార్థులు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. జిల్లాలోని 10ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యను బలోపేతం చేసేవిధంగా ప్రతి కళాశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తుందని, దీనికి గాను అన్ని కళాశాలలో నాలుగు డిజిటల్ టీవీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రతి కళాశాలకు మైనర్ రిపేర్లకు నిధులు మంజూరు చేసి కళాశాల భవనాలను కొత్తవిగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యనరకమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోతు జ్యోతి, వార్డు కౌన్సిలర్ నీరుటి హేమ, అధికారులు మధార్, మందుల శ్రీరాములు, శంకర్, బాలాజీ, అప్పారావు, పూర్ణచందర్, విజయకుమారి, సురేష్, సతీస్, ఉమామహేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఆయా కళాశాలల అద్యాపక బృందం, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# నేడు జిల్లా ప్రజావాణీ తాత్కలికంగా రద్దు

**-జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**ప్రభాతవార్త ప్రతినిధి – జయశంకర్ భూపాలపల్లి బ్యూరో**

నేడు సోమవారం కాళేశ్వరంలో నిర్వహించనున్న నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మాక్ డ్రిల్ మరియు సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించిన కార్యక్రమాల్లో జిల్లా అధికారులు పాల్గొనాల్సి ఉన్నందున సోమవారం నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సంబంధిత కార్యక్రమాల దృష్ట్యా అధికారులు అందుబాటులో ఉండరని, కాబట్టి ప్రజలు ఈ విషయాన్ని గమనించి సోమవారం దరఖాస్తులు ఇచ్చేందుకు రావొద్దని ఆయన సూచించారు.

# ఆర్ట్స్ కళాశాలలో క్లాత్‌సంచుల పంపిణీ..!

**ఎడ్యుకేషన్ కేయూ, మే 17 ప్రభాతవార్త :**



పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో క్లాత్‌సంచుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల్లో ప్లాస్టిక్‌వల్ల కలుగుతున్న పర్యావరణ కాలుష్యంపై అవగాహన పెంపొందించేందుకు క్లాత్ తో తయారుచేసిన సంచులను పంపిణీ చేసినట్లు ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ప్లాస్టిక్‌సంచుల వినియోగం భూమి, జలవనరులు, జీవవైవిధ్యంపై తీవ్రప్రభావం చూపుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ పర్యావరణ హితమైన గుడ్డసంచులను వినియోగంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీలత, డాక్టర్ రమేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని క్లాత్ సంచుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# నకిలీ పత్తి విత్తనాలు, ఎరువుల విక్రయాలపై పోలీసుల ఉక్కుపాదం మోపుతాం

**-అమ్మకందారులపై కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తాం...**

**-జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



**ప్రభాతవార్త ప్రతినిధి – జయశంకర్ భూపాలపల్లి బ్యూరో**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ హెచ్చరించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ..జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు, ముఖ్యంగా బీజీ–3 వంటి నిషేధిత విత్తనాల విక్రయం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలిపారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూపాలపల్లి జిల్లాలో ఎవరైనా నిషేధిత విత్తనాలు లేదా నకిలీ ఎరువులు విక్రయిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు తీసుకుని రెండేళ్ల వరకు జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో నకిలీ విత్తనాల అరికట్టడానికి ప్రతి మండలంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ విత్తనాలు లేదా నకిలీ ఎరువుల విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీస్ అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# కుంటుపడిన డ్రైనేజీ వ్యవస్థ

**శుభ్రం చేయమంటే మా పని కాదంటున్న సిబ్బంది**

**హసన్ పర్తి, మే 17, ప్రభాతవార్త.**



గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 వ డివిజన్ హసన్ పర్తి లో డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిగా కుంటుబడిపోయింది. ఎక్కడ చూసినా డ్రైనేజీలో మట్టి పేరకపోయి, వివిధ రకాల వస్తువులు చేరి, ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయినప్పటికీ శుభ్రం చేసే నాధుడే లేడు. జాతీయ రహదారిని అనుకొని ఉన్న ప్రధాన డ్రైనేజీ వివిధ రకాల వాణిజ్య దుకాణాల ముందు మురికి నీరు నిలిచిపోయి దుర్గంధం గజల్లుతున్న పారిశుద్ధ కార్మికులు పట్టనట్లు వ్యవహరించడంపై ని నిరసన వ్యక్తం అవుతుంది. వ్యాపార సంస్థల యజమానులు ఎన్నిసార్లు సంబంధిత సిబ్బందికి మొరపెట్టుకున్న డ్రైనేజీని శుభ్రం చేసిన నాధుడే లేడు. సంబంధిత జవానును అడిగితే ఆ పని మాది కాదంటూ దాటవేయడం అలవాటుగా మారింది. ఇప్పటికైనా ఉన్నత అధికారులు చొరవ చూపి డివిజన్లో ఉన్న డ్రైనేజ్ వ్యవస్థను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుకుంటున్నారు.


# ఆర్టీసీ ప్రయాణమే సురక్షితం

**ప్రజా రవాణాను ఆదరించండి**

**ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ ఎస్.భవాని ప్రసాద్**

**మే 17, ప్రభాతవార్త, హన్మకొండ టౌన్**

:ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ కొరతతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ ఎస్ భవాని ప్రసాద్ అన్నారు. ఇట్టి పరిస్థితుల్లో డీజిల్ ధరలు పెరగడం వల్ల వాహనదారులకు మరింత భారం పడే అవకాశం ఉందని, దానికి ప్రత్యామ్నాయంగా ఆర్టిసి బస్సులో ప్రయాణించి తమ భారాన్ని తగ్గించుకోవచ్చని వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్. భవాని ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రస్తుతం వరంగల్ రీజియన్ లో 1100 బస్సులు ఉన్నాయని, ఈ వసూలు వివిధ రూట్లలో తిరుగుతున్నాయని, అందులో ప్రత్యేకంగా హైదరాబాద్ కి 315 ట్రిప్పులు తిరుగుతున్నాయని అన్నారు. లహరి బస్సులు, రాజధాని బస్సులు, సూపర్ లగ్జరీ బస్సులు, డీలక్స్ బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు, పల్లె వెలుగు బస్సులు ఇలా అనేక రకాల బస్సులు సుమారు 1100 ఉన్నాయని అన్నారు. వాహనదారులు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడం వల్ల వారికి డీజిల్ ఆదా అవుతుందని, యాక్సిడెంట్లు కూడా తగ్గుతాయని, కాబట్టి ప్రజలు, వాహనదారులు ప్రజా రవాణా సంస్థ అయిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి క్షేమంగా సురక్షి తంగా వారి గమన స్థానం



చేరవచ్చని అన్నారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం వల్ల వాహనదారుల ఆదాయం కూడా పెరుగుతుందని, తక్కువ ఖర్చులో ఎక్కువ దూరం ప్రయాణం చేయడం వల్ల వారి ఆదాయం పెరుగుతుందని అన్నారు. ప్రధాన రూట్లో 24 గంటలు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయని అన్నారు. అలాగే ఇంధన పొదుపు కోసం డ్రైవర్ లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, దానివల్ల ఇంధన పొదుపు జరిగి దేశంలోనే తెలంగాణ ఆర్టీసీ ఇంధన పొదుపులో మొదటి స్థానం లభిస్తుంది అన్నారు. తక్కువ డీజిల్ తో ఎక్కువ కిలోమీటర్లు ప్రయాణించే విధంగా డ్రైవర్ లకి ప్రత్యేక శిక్షణ ఇస్తుంటామని అన్నారు. ఎప్పటికప్పుడు డ్రైవింగ్ లో టెక్నిక్స్ తెలియచేస్తూ, ఇంధన పొదుపు కోసం ప్రతి ఒక్క డ్రైవర్ కి శిక్షణ ఇస్తామని, అలాగే ప్రమాదాల నివారణకు ప్రత్యేక శిక్షణ ఇస్తుంటామని అందువల్ల దేశంలోనే ఆర్టీసీ తెలంగాణ ఆర్టీసీ ప్రమాదాల రేటు అతి తక్కువగా ఉందని, రాబోయే కాలంలో జీరో యాక్సిడెంట్ దిశగా ఆర్టీసీ ని తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. అలాగే పొల్యూషన్ నివారించకు ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రస్తుతం వరంగల్ రీజియన్ లో 115 విద్యుత్ బస్సులు ఉన్నాయని వాటి వల్ల పొల్యూషన్ బాగా తగ్గుతుందని అన్నారు. విద్యుత్ బస్సులలో ప్రయాణం కూడా సుఖంతంగా ఉంటుందని అందువల్ల రాబోయే కాలంలో కాలుష్య నివారణ కోసం ప్రభుత్వం మరిన్ని విద్యుత్ బస్సులను ప్రవేశపెడుతుందని అన్నారు. ఆర్టీసీలో క్రమశిక్షణతో ఉన్న ఉద్యోగులు ఉన్నారని ముఖ్యంగా డ్రైవర్లు కండక్టర్లు ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందిస్తున్నారని, ప్రజలందరూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించి సుఖవవంతమైన ప్రయాణం చేయాలని, మహిళలందరూ మహాలక్ష్మి ్మ పథకమును ఉపయోగించుకొని ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మరియు ప్రయాణికుల డిమాండ్ మేరకు అన్నిరుటలో బస్సులను తిప్పుతున్నామని అన్నారు.